కథల డాక్టరు

ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

డిసెంబర్ 06, 2015

NAVEEN PRASAD
VISAKHAPATNAM
Cell : 9849070838

యురేకా అంటార్కిటికా

ఖరీదైన పాటలు



అందానికి, ఐశ్వర్యానికి పెట్టింది పేరు బాలీవుడ్. వందల కోట్ల రూపాయలు వసూలు చేసే చిత్రాలు వున్నట్టే... ఖర్చు పెట్టించే సినిమాలూ వున్నాయి. కొన్ని ప్రత్యేకమైన సన్నివేశాలు, పాటలకు కోట్లు వెచ్చిస్తుంటారు దర్శకనిర్మాతలు. చిత్ర నిర్మాణం పట్ల వున్న అవ్యాజమైన ప్రేమానురాగాలే అందుకు కారణం. అలాంటి కొన్ని సినిమాలు...పాటల వివరాలు...

దీవానీ మస్తానీ

రణవీర్ సింగ్ పేష్వా బాజీరావ్‌గా, అతని ప్రియురాలిగా దీపికా పదుకొనే, భార్య కాశీబాయిగా ప్రియాంకా చోప్రా చేసిన చిత్రం 'బాజీరావ్ మస్తానీ'. పై అంతస్తులో చెలికత్తెల మధ్యలో కూర్చున్న ప్రియాంక చోప్రా... తన ఆసనంలో సుఖాశీనుడైన బాజీరావు చూస్తుండగా.... మాండోలిన్ చేతిలో పట్టుకొని దీపిక పాడే పాట 'దీవానీ మస్తానీ'. 2,500 చదరపు అడుగుల స్థలంలో వేసిన భారీ సెట్టింగ్‌లో 20,000 ఖరీదైన అద్దాలను ఉపయోగించి ఈ పాట చిత్రీకరించారు.

దేవదాస్

బాలీవుడ్ మెచ్చిన ఇద్దరు డాన్సర్లు మాధురీ దీక్షిత్, ఐశ్వర్యా రాయ్. ఈ ఇద్దరూ కలిసి చేసిన చిత్రం 'దేవదాస్'. ఇందులోని 'డోలా రే, మార్ డాలా...' పాటలను అద్భుతంతా తీశారు. తారలకు ఖరీదైన వస్త్రాలు, భారీ నగలు, వందలాది జూనియర్ ఆర్టిస్టులు, ఆకట్టుకునే దీపాలు... పాటల్లో ప్రత్యేక ఆకర్షణ.

మలంగ్

'ధూమ్ 3'లోని ఈ పాటకోసం 200 మంది జిమ్నాస్టిక్ డాన్సర్లు పనిచేశారు. ఆమీర్ ఖాన్, కత్రీనా కైఫ్‌తో పాటుగా డాన్సర్లకు సైతం ప్రత్యేకమైన శిక్షణ ఇచ్చారు. సాధనకు, చిత్రీకరణకు కలిపి 20 రోజులు పట్టింది. పాట కోసం అమెరికా నుంచి కాస్ట్యూమ్స్‌ను తెప్పించారు.రు. 5 కోట్లు ఖర్చయిందని అంచనా.

ప్యార్ కియాతో డర్నా క్యా

1960లో విడుదలైన 'మొఘల్ ఎ ఆజమ్' చిత్రం లోనిదీ పాట. దీనికోసం అప్పట్లోనే కోట్లాది రూపాయలు వెచ్చించారు. ఒక సన్నివేశంలో అద్దానికి బదులుగా నిజమైన డైమండ్‌నే వాడేశాడు దర్శకుడు కె. ఆసిఫ్. దీన్ని బట్టే ఈ చిత్ర బడ్జెట్‌ను



అంచనా వేసుకోవచ్చు. ఈ పాటను కూడా రంగుల్లో చిత్రీకరించారు. అప్పట్లో ఇది పెద్ద ప్రయోగమనే అనుకోవాలి.

ధోల్ బాజే...

2013లో విడుదలైన చిత్రం రామ్ లీలలోని ఈ పాట సినిమాకే హైలైట్ అనుకోవాలి. దీపికా పదుకొనే గార్బా డాన్సర్లలో కలిసి చేసిన ఈ పాటను పది రోజులపాటు ఫిల్మ్ సిటీలో చిత్రీకరించారు.

అజీమ్ ఓ షాన్ షెహన్షా

2008లో విడుదలైన జోధా అక్బర్ చిత్రంలోనిదీ పాట. 400 మంది డాన్సర్లు, 2 వేల మంది ప్రేక్షకులు చూస్తుండగా పది రోజులపాటు చిత్రీకరించారు.

పార్టీ ఆల్ నైట్

'బాస్' చిత్రంలో అక్షయ్ కుమార్, సోనాక్షి సిన్హాపై ఒక పబ్‌లో తీసిన పాట ఇది. తన నేస్తం అక్షయ్ కోసం సోనాక్షి ఎలాంటి పారితోషికం తీసుకోకపోతేనే... ఈ ఒక్క పాట కోసం చాలా పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేయాల్సి వచ్చింది. సగానికి పైగా బ్యాంకాక్‌లో చిత్రీకరణ జరుపుకున్న ఈ పాటలో 600 మంది విదేశీ డాన్సర్లు పాల్గొన్నారు. రు.6 కోట్లు ఖర్చయిందని అంచనా.

థా కర్కే

రోహిత్ శెట్టి 'గోల్‌మాల్ రిటర్న్స్' చిత్రంలోనిదీ పాట. ఇందులో వెయ్యికి పైగా డాన్సర్లు, 180 మంది ఫైటర్లు పాల్గొన్నారు. కరీనా, అజయ్ దేవగన్ ప్రధాన తారాగణం. పన్నెండు రోజులపాటు సాగిన ఈ పాట చిత్రీకరణలో వీళ్లు కాక పది కార్లు కూడా కనిపిస్తాయి. రు.3 కోట్లకు పైగా ఖర్చయిందని అంచనా. ◆

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

సైజ్ జీరో !

సన్నజాజి తీగలా.. నాజూగ్గా.. రెవటలా... సరిగ్గా చెప్పాలంటే సైజ్ జీరోలో వుండాలి. ఇంకా స్పష్టంగా అంటే ... జెన్నిఫర్ లోపెజ్‌లా, కరీనా కపూర్‌లా, ఇలియానాలా ... స్లిమ్ముగా వుండాలి. ఈ మధ్య తరచూ వినిపిస్తున్న మాటలివి. అమ్మాయిలు అందుకోసం నానా తిప్పలు పడుతున్నారు. కమ్మటి తిండికి దూరమౌతున్నారు. జిమ్ములంటున్నారు. యోగా అంటున్నారు. వర్కవుట్లంటున్నారు. స్పెషల్ డైట్లంటున్నారు. ఎముకల గూళ్లలా తయారౌతున్నారు. లాభాలకోసమైతేనేమి... వీరి మనోభీష్టిని సిద్ధింపచేసేందుకైతేనేమి... సౌందర్యం ఓ పరిశ్రమలా తయారై విస్తరించింది. బరువు తగ్గించే సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. సౌందర్య సాధనాల సంగతి సరేసరి. లెక్కలేనన్ని కంపెనీలు వెలిశాయి.

అర్జంటుగా సన్నబడేందుకు దగ్గర దారులు వెతుకుతూ ప్రాణాల మీదకు తెచ్చుకునే కోమలాంగులకు కొదవు లేదు. 'నువ్వు నాకు నచ్చావ్' అంటూ తెలుగు తెరకు పరిచయమైన ఆర్తీ అగర్వాల్ మరణోదంతం అందుకు ఒక ఉదాహరణ మాత్రమే. సైజ్ జీరో కోసం స్వీడన్‌కు చెందిన ఓ పాతికేళ్ల యువతి ఏకంగా పక్కటెముకలనే తీయించుకుందంటే సన్నబడాలన్న కాంక్ష ఆమెలో ఎంత బలంగా వుందో అర్థం చేసుకోవచ్చు. పిడికెడు నడుము కోసం ఆమె ఎంతగా పరితపించిందో తెలుసుకోవచ్చు. మోడళ్లు, సినీ స్టార్లు సన్నగా వుండడం వల్ల వారి వృత్తిలో రాణించడానికి ఉపయోగపడవచ్చేమో! మిగతా వారి సంగతేంటి? ఇంట్లో పని చేసుకోవాలన్నా, ఉద్యోగాలు చేయాలన్నా, పిల్లాపాపలను సాకాలన్నా పుష్టిగా ఆరోగ్యంగా వుండాలి. ఒంట్లో కొవ్వు పేరుకుపోకుండా ఎండబెట్టుకుంటే నాడీ వ్యవస్థ సరిగా ఎదగదన్నది నిపుణుల మాట.

నిజానికి సైజ్ జీరో కావాల్సింది ఎదిగే వయసులో వున్న అమ్మాయిలకు కాదు. అద్దాల్లో ఆకారాలు కనపడనంతగా అడ్డంగా ఊరిపోయిన రాజకీయ నేతలకు. వైడ్‌గా పెరుగుతూ లిఫ్టుల్లో ఇరుక్కుపోతున్న రాజకీయ నేతలకు జీర్ సైజ్ కావాలి. పెళ్లిళ్లు పేరంటాలకు వారు చేసే ఖర్చు జీరో సైజు కావాలి. నేతలు కట్టుకునే భూలోక ఇంద్ర భవంతులు జీరో సైజ్ కావాలి. చిన్నదానికి పెద్దదానికి వారు చేసే ఆర్భాటాలు జీరో సైజ్ కావాలి. తెలివి తక్కువ నిర్ణయాలతో పర్యావరణ కాలుష్యానికి ఆజ్యం పోస్తున్న పెద్దలకు అండదండలనిస్తున్న నేతల ఆలోచనలు జీరో సైజ్ కావాలి. కనీసం అప్పుడైనా ... ఆహార పదార్థాలు, సౌకర్యాలు ఇటు నుంచి అటు బదిలీ అయి ... కొంతలో కొంతయినా సమతుల్యత ఏర్పడుతుంది. తినడానికి తిండి లేక బక్కచిక్కిన వారికి కాస్తన్నా కండ పడుతుంది !

■



◆ మనలో మాట

టపా

అసాధారణం

కూరగాయలమ్మిన చేత్తోనే క్యాన్సర్ చికిత్స చేయడం అసాధరణ విషయం. మురికి వాడలో పుట్టిన విజయలక్ష్మీ దేశ్‌మనే పట్టుదలతో డాక్టరేట్ పూర్తి చేసి పేద ప్రజలకు సహాయ పడడం అభినందించదగ్గ విషయం. పురాతన వాడ చాలా బాగుంది. మన దేశంలో పురాతన వస్తువుల పట్ల కనీస జాగ్రత లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పురాతన వస్తువులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదీ.

నాగార్జున, వెదురూర్, చాపాడు, కడప

అంతు లేదా?

ఒడిషా, రాజస్థాన్, కర్నాటక, గుజరాత్ రాష్ట్రాల్లో అంటరానితనం మరీ ఎక్కువగా ఉంది. మన రాష్ట్రంలోనూ అనేక గ్రామాలలో కుల వివక్ష దాడులు కొనసాగుతున్నాయి. జస్టిస్ పున్నయ్య కమిషన్, కోనేరు రంగారావు కమిటీ సిఫారస్‌ల అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. 'తరగతి గదిలోనూ కుల వివక్షా?' వ్యాస రచయితకు ధన్యవాదాలు.

తుంపాల శ్రీరామూర్తి, గాజువాక, విశాఖ

'మెటిల్డా' కథ బావుంది

గోండుల రాజు, దేవుడు రావణుడు. రామాయణంలో రావణుడిని ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా పేర్కొంటారు. ఎవరి నమ్మకాలు వారివి. బలవంతంగా మత మార్పిడి చేసినంత మాత్రాన వారి కులదైవాలు, ఆరాధించే దేవుళ్లు మారిపోరు. ప్రతి వారం కొత్త కొత్త రుచులను అందిస్తున్నందుకు సంతోషం. మెటిల్డా కథ చాలా బాగుంది. గురజాడ వారు సమాజంలో వితంతువులు ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లకు కట్టినట్టు వివరించారు.

రాము, కడప

ప్రమాదపుటంచుల్లో ...

మెరుపు మెరిస్తే, వాన కురిస్తే, ఆకాశమున హరివిల్లు విరిస్తే అవి మాకే అని ఆనందించే అడవి పుత్రులు. వారి జీవితాలు నేడు అగమ్యగోచరంగా మారుతున్నాయి. కష్టాల కడలిలో వారు జీవితాలను గడుపుతున్నారు. జీవనోపాధి కోసం వారు సేకరించే తేనె వివిధ రోగాలకు దివ్య ఔషధంగా ఉపయోగపడుతుంది. ఈ తేనె సేకరించే ప్రక్రియలో వారి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వారి జీవనపోరాటాన్ని సాగిస్తున్నారు. ప్రభుత్వం వీరికి తగిన రాయితీలు, ప్రోత్సాహకాలు అందించాలని కోరుకుంటున్నాను. ఈ వ్యాసం ద్వారా గిరి పుత్రుల కష్టాలను తెలుసుకున్నాం.

దేవరాజు, బెన్నవోలు, చోడవరం, విశాఖ

నవీన జీవితం

ఫాదర్స్‌డే, మదర్స్‌డే, ప్రేమికుల రోజు ఇలా చెప్పుకుంటూ పోతే సంవత్సరం పొడువునా ఏదో ఒక రోజు వస్తూనే ఉంటుంది. వ్యాపార ప్రకటనల మోజులో గిఫ్ట్‌లు, బహుమానాలు ఇవ్వడం అలవాటు చేస్తున్న రోజులివి. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నది అన్న సామెత ప్రకారం పాశ్చాత్య దేశాల మోజు, వ్యాపార ప్రకటనల వ్యామోహంతో తమ జేబులను ఖాళీ చేసుకుంటున్నారు. సమాజాన్ని మేల్కొల్పే వ్యాసాలు మరిన్ని రావాలన్ని కోరుకుంటున్నాను. ఈ వారం కలర్ పేజీలు అన్ని బాగున్నాయి. అక్షయ్ కుమార్ గురించి తెలిపిన వివరాలు బాగున్నాయి.

మౌనిక.ఎం, తూ.గో.జిల్లా

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

యురేకా... అంటార్కిటికా...

కవర్ స్టోరీ ———— 6



వేల మీటర్ల పర్వతాల్ని కప్పేస్తూ లక్షల ఏళ్ల నాటి మంచు దుప్పట్లు కప్పుకున్న ఖండం. మంచు యుగాల రాకపోకల్లో దారి తప్పి శాశ్వతంగా గడ్డకట్టుకుపోయిన అతి శీతల మేఖల. మొత్తం భూ వాతావరణాన్ని శాసిస్తున్న హిమలోకం. మొత్తం భూగోళానికే ఎయిర్ కండిషనింగ్ చేస్తున్న ధృవపు ప్రాంతం అంటార్కిటికా లేని భూమి మరోలా ఉండేది. అంతరిక్షం నుంచి చూస్తే మంచు కలకండలా తోచే దీని విషయాలన్ని విస్మయాలే. దాని విశేషాలన్ని విలక్షణాలే.

మార్గదర్శి 3
పచ్చదనపు తల్లి

స్ఫూర్తి 4
ప్రకృతి మనుష్

కార్టూన్ పంచ్ 5

ఆదర్శం 10
వీధిబాలల సాథీ

సినిమా కబుర్లు 14
కథల డాక్టరు

వింత లోకం 16
బుద్ధి చెప్పడానికే..

తెలుసా 17
పట్టడక్కల్

కథ 18
వెలుతురు చెట్లు

రుచి 21
పులావ్

బాల నేస్తాలు 22
గొడుగు పక్షులు

కొత్త పుస్తకాలు 24

జాషువా కవిత్వం నిత్య స్ఫూర్తిదాయకం



ప్రత్యేకం -12
గూఢచారి షో

చెట్లు గొడుగు పట్టే దారిన సాగే ప్రయాణానికి మించిందేముంది. అదే దారి 4 కిలోమీటర్లు సాగితే ఆ ఆహ్లాదానికి అవధులుండవు. ఈ చెట్ల సారంగాన్ని ఏ అటవీ శాఖో, పర్యావరణ సంఘమో మొక్క నాటలేదు. చదువురాని ఇద్దరు భార్యాభర్తలు కన్నబిడ్డల్లా సాకిన చెట్ల వరుసలవి. అరవై ఏళ్ల వారి పెంపకంలో ఎదిగిన ఆ రావి చెట్లే వారి పంచ ప్రాణాలయ్యాయి. అక్షరం ముక్క రాని ఆ పచ్చదనపు తల్లి చేత పెరిగిన ఆ చెట్ల చలువకు వెలకట్టలేం.

పచ్చదనపు తల్లి

కర్ణాటకలోని రామ్‌నగర్ జిల్లాలోని కుదూరు, హులికల్ గ్రామాలను కలిపే రహదారే ఈ చెట్ల వరసల మధ్య నీడ కాచుకుంటోంది. ప్రకృతి ఆర్కిటెక్ట్ చేత మలచబడ్డ అలంకరణలా వన్నెలీనే ఈ చెట్ల వరస పేర వాటిని పెంచిన తల్లి తిమ్మక్కను పర్యావరణవేత్తలు పిలుచుకుంటున్నారు. 'సాలుమరాడ తిమ్మక్క' అంటే 'చెట్ల వరసల తిమ్మక్క' అని అర్థం. అదే పేరిట అమెరికాలోని ఓ పర్యావరణ హిత సంఘమూ పేరు పెట్టుకుంది. అంత ఉన్నతమైంది ఆ భార్యభర్తల కృషి. హులికల్ గ్రామంలో రాళ్ల క్వారీలో పనిచేసిన తిమ్మక్క, పశువుల కాపరి చిక్కయ్యకు 70 ఏళ్ల క్రితం వివాహమైంది. కానీ పిల్లలు లేరు. దీనికి తోడు చిక్కయ్యకు మాట తొణుకుతుండేది. ఏవేవో ఊహించుకున్న ఊరి వాళ్లు నిత్యం వేధింపులతో ఈ భార్యభర్తలను హింసించేవారు. ఆ వెనుకమాటలు, ముందు పోటులను పట్టించుకోని ఆ దంపతులు పిల్లల కోసం అవస్థలు పడే బదులు చెట్లనే కన్నబిడ్డల్లా సాకితే బాగుంటుందని నిర్ణయించుకున్నారు. వారి ఊరిలో ఎక్కువగా కనిపించే రావి చెట్లతో వారిది చిన్ననాటి అనుబంధం. వాటినే పెంచేందుకు నిశ్చయించుకున్నారు. ఊరికి దూరంగా 4 కి.మీ.ల అవతల ఉన్న ఖాళీ ప్రాంతాన్ని ఎంచుకున్నారు. తొలుత పది మొక్కల్ని దారికి ఇరువైపులా కట్టారు. వాటిని పశువులు మేయకుండా ముళ్ల చెట్లతో కంచెను ఏర్పాటు చేశారు. ప్రతి రోజు నాలుగు తడవల్లో వాటికి నీరు పోసేవారు. అదీ 4 కి.మీ. తమ ఇంటి నుంచి నీటిని మోసుకెళ్లి. చెట్లకు ఏడాది వయసు వచ్చాక 3 రోజులకోసారి. పదేళ్లు వచ్చాక వారానికోసారి నీటిని మోసేవారు. వర్షాకాల ప్రాంతంలో మొక్కల్ని నాటడంతో కాస్త శ్రమ కూడా తగ్గింది. అవి ఎదుగుతుంటే సొంత బిడ్డలు ఎదుగుతున్నట్టే మురిసిపోయిన ఆ దంపతులు పిల్లల్ని అంతటకే సరిపెట్టుకోవడం ఇష్టం లేక ఏ యేడుకా యేడు మరిన్ని మొక్కల్ని నాటి పెంచారు. అలా ఇప్పుడు 384 చెట్లు 5 కి.మీ.ల పొడవునా

పెరిగి పచ్చటి సారంగాన్ని వేశాయి. బెంగళూరుకు 80 కి.మీ. దూరంలో ఉన్న ఈ గ్రామానికి కేవలం ఈ దారి ద్వారానే పేరు వచ్చింది. తొలుత అందరూ ఏదో ప్రభుత్వ కార్యక్రమం అనుకునేవాళ్లు. కానీ ఇది అంతా ఇద్దరు భార్యాభర్తల వల్లే అని తెలుసుకునే సరికి విస్తుపోయేవాళ్లు. చాలామందికి ఇది అసాధ్యంలా తోచేది.

బొట్టు బొట్టు పట్టి...

తిమ్మక్క-చిక్కయ్యల కృషి గురించి ఆ నోటా ఈ నోటా తెలిసి ఎందరో పర్యావరణ మిత్రులు, స్వచ్ఛంద సేవకులు వారిని తమ కార్యక్రమాలకు సారథులుగా నియమించుకున్నారు. ప్రతి ఇంటికో చెట్టు వంటి ఎన్నో కార్యక్రమాలు అక్కడ విజయవంతం కావడానికి వారి కృషే కారణం. స్థానికంగా జరిగే తిరునాళ్లకు వేల సంఖ్యలో జనాలు హాజరయ్యేవాళ్లు. నీరు కటకటగా ఉండటంతో అక్షరం ముక్క రాని తిమ్మక్క దగ్గర ఓ మంచి ఉపాయం ఉంది. అదే వర్షపు నీటిని నిల్వ ఉంచే ట్యాంకు. ఆమె ఆలోచనతో, ప్రచారంతో తేలిగ్గా నిధులు పోగై వాటర్ ట్యాంక్ నిర్మాణం చకచకా సాగిపోయింది. అప్పటి నుంచి తిరునాళ్ల నీటి అవసరాలు ఆ ట్యాంకే తీరుస్తోంది. అలాంటివెన్నో కార్యక్రమాలను తిమ్మక్క ముందుండి నడిపించింది. 1990లో చిక్కయ్య మరణించిన తర్వాత కూడా ఆమె ఎక్కడా వెనకడుగు వేయలేదు. విద్యార్థులకు, గ్రామస్తులకు చెట్ల విలువను వివరించి చెప్పే ఆమెను అంతర్జాతీయ పర్యావరణవేత్తలు కూడా కలుసుకుని అభినందనలు తెలిపారు. 'ప్రియదర్శిని ఇందిరా వృక్షమిత్ర' అవార్డుతో ఆమె సేవల్ని గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ జాతీయ పౌర అవార్డును 1995లో అందించింది. ప్రఖ్యాత గాడ్‌ఫ్రే ఫిలిఫ్ బ్రేవరీ అవార్డు కూడా అందుకున్న ఆమె నూరేళ్ల వయసులోను పచ్చదనం కోసం పనిచేస్తూనే ఉంది. ఎన్ని అవార్డులొచ్చినా ప్రభుత్వం అందించే 500 రూపాయల పింఛన్‌తో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితిలో చూపించడానికి అవార్డులు తప్ప ఆ ఇంట ఏ ఖరీదైన వస్తువు లేని పేద జీవితాన్ని అనుభవిస్తోంది. ఆసరాగా ఉండేందుకు ఓ యువకుణ్ని దత్తత తీసుకున్న ఆమె అతణ్ని కూడా పర్యావరణ హితానికే మార్గదర్శనం చేస్తోంది. చదువురాని ఆమె పేరును ఉపయోగించుకుని కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడిన విషయంపై కోర్టుకెక్కి పోరాడింది కూడా. పేదలకు ఉపయోగపడేలా ఆసుపత్రి నిర్మాణానికి తన పేరిట నిధులు సేకరించేందుకు అంగీకరించింది. తన పేరు ఎందుకైనా ఉపయోగపడాలంటే అది చెట్ల కోసమే అని బలంగా చెప్పే సాలు మరాడా తిమ్మక్క నిండు జీవితాన్ని చూసింది. అంతటి అనుభవంతో ఓ మాట చెబుతోంది.

✦

స్ఫూర్తి

ప్రకృతి మనుష్

నేను చాలా స్వార్థపరుడునని అంటాడు పీయూష్ మనుష్. ఎంత స్వార్థమంటే తన మనసును సంతృప్తి పరుచుకునేందుకు ఓ అడవిని పెంచేశాడు. ఆరు సరస్సులకు ప్రాణం పోశాడు. బడా కంపెనీలు కొండల్ని పిండి చేయకుండా జనాల్ని పోగేశాడు. గృహ హింస నుంచి, రోడ్డు భద్రత వరకూ, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ నుంచి ఆపరేషన్ గ్రీన్ హంట్ వరకు ప్రతి సమస్యపై స్పందిస్తూ మనసును కుదుట పరుచుకుంటున్నాడు.

సేలంకు చెందిన పీయూష్ మనుష్ ఇంటి పేరు సేతియా. అది తీసేసి మనిషయ్యాడు. కాలేజీ పుస్తకాల్లో ప్రపంచం తెలీక విద్యార్థి ఉద్యమకారుడిగా లోకం చూశాడు. సమాజంలోని చెడుపై అతడి దూకుడుకి అడ్డుకట్ట వేయలేక డిగ్రీ చివరి ఏడాది ప్రిన్సిపాల్‌పై హత్యాయత్నం చేయబోయాడంటూ అభియోగం మోపారు. కాలేజీ అయిపోయింది ఏం చేయాలి? నగరంలో ఉద్యోగమా, తండ్రి వ్యాపారమా? ఈ రెండూ కాకుండా మరోటి ఉందా అనుకుంటూనే పట్టణంలోని కాంక్రీట్ జంగిల్‌ను పరికించాడు.

పచ్చతొడుగు వేసేందుకు పెద్ద ఎత్తున మొక్కల్ని నాటే పనిని చేపట్టాడు. బతుకు దెరువు కోసం ఎర్రలు ఏరాడు వర్మీ కంపోస్ట్ మొదలెట్టాడు. హానికారక రసాయన ఎరువులకు విరుగుడదని గమనించాడు. విస్తరాకుల వ్యాపారం చేశాడు. ప్లాస్టిక్ సమస్యకు చెక్ పెట్టొచ్చనుకున్నాడు. వెదురు ఫర్నీచర్ ప్లాంట్ పెట్టాడు. స్టీల్, సిమెంట్ వాడకాన్ని తగ్గిస్తుందని నమ్మాడు. పల్లెల నుంచి మెరుగైన జీవనం పేరిట పట్టణాలకు తరలిపోతున్న వైనం చూస్తుండి పోయాడు. జనం ఎక్కువై నగరం చచ్చిపోతున్న తీరు కనిపెడుతూనే ఉన్నాడు. దానికి పరిష్కారం తిరిగి గ్రామాలకు వలస అని నినాదం అందుకున్నాడు. దగ్గరలోని ఓ గ్రామంలో అరెకరం పొలం కొని వెదురు పెంపకం చేపట్టాడు. రాళ్లు తప్ప పచ్చదనం జాడే కనిపించని ఆ ప్రాంతంలో క్రమంగా జామ, మామిడి, సీతాఫలం, అలోవీరా మొక్కల్ని నాటేందుకు మరికొన్ని ఎకరాలు పోగు చేశాడు. మిత్రుల్ని కలిసి సహకార అడవి ఆలోచన బుర్రల్లో నాటాడు. 2009లో 40 మందిని కదిలించి ఓ భారీ ప్రాంతంలో అడవికి నాట్లు వేసి దగ్గరుండి ఫలాల్ని పండించి లాభాల్ని అందించే సరికి ఈ వ్యాపారమేదో బాగుందే అనుకున్నారు. అటు ప్రకృతికి మేలు, ఇటు పచ్చటి డబ్బు. అలా అది 140 ఎకరాలు దాటిపోయి పక్కన మరో సహజ సిద్ధమైన అడవి పోటీ ఇవ్వలేనంతగా విస్తరించింది. వెదురు ఫర్నీచర్ వ్యాపారాన్ని మరికొందరు ఉత్సాహ వంతులకు అప్పజెప్పి సేలం సమస్యలపై దృష్టి పెట్టాడు. బాలల వేధింపులకు వ్యతిరేకంగా, గృహ హింసకు వ్యతిరేకంగా మిత్రుల్ని పోగేసి నిరసనలు, పోరాటాలు చేశాడు. తన అడవి పూర్తిగా వికసించే నాటికి దగ్గరలోని కంజమలై కొండల్ని పెద్ద కంపె నీలు ఇనుప గనుల కోసం మింగేసే ప్రయత్నం చేస్తున్నాయని తెలిసింది. 2008 నుంచి దానికి వ్యతి రేకంగా ఉద్యమంలో పాల్గొని కొండలకు పోటు పడ కుండా ఆపాడు. మావోయిస్టుల ఏరివేత పేరిట కేం ద్రం మొదలెట్టిన గ్రీన్‌హంట్‌లో అమాయకులు బలై పోతున్నారని, అడవి నాశనమైపోతోందని 2010 సేలం రిపబ్లిక్ డే పరేడ్‌లో ప్రవేశించి కరపత్రాలు పంచాడు. అరెస్టు చేసి పోలీసు రికార్డుల్లో పేరు రాస్తే వాటిల్లోనైనా ఇంటి పేరు కనిపిస్తుందిలేనని నవ్వేశాడు. ఇనుము వెలికితీత అవసరమే అయితే స్థానిక ప్రజలకే అప్పగించాలని అంటాడు.

గ్రీన్ వారియర్

పర్యావరణం కోసం పీయూష్ చేస్తున్న కృషిని గుర్తించి ధర్మపురి కలెక్టర్ కబురు పెట్టాడు. పారిశ్రామిక వ్యర్థాలు, ప్లాస్టిక్, చెత్తతో కాలుష్య కాసారంగా మారిన మూకావరీ సరస్సుకు మళ్లీ జీవకళ తెచ్చే బాధ్యత అప్పజెప్పాడు. ఇలాంటి కార్యక్రమం కోసమే ఆయన మనసు చాలా రోజుల నుంచి చాలా స్వార్థంగా దిగులు పెట్టుకుంది. సేలం సిటిజెన్ ఫోరం వేదికపైకి తెచ్చి చెరువు ప్రక్షాళన మొదలెట్టాడు. ప్రతి ఆదివారం 150 మంది ప్రజలు ఏడు నెలల పాటు పెద్ద ఎత్తున సాగించిన ఆ కార్యక్రమం మూకావెరికి జీవ కళనే కాదు పక్షి సంరక్షణ కేంద్రంగా గుర్తింపు తెచ్చేలా చేసింది. ఓ పక్షి పరిశోధకుడు కేవలం రెండు గంటల పర్యటనలో 42 పక్షి జాతుల్ని గుర్తించి ఆశ్చర్యపోయాడు. శెవారోయ్ కొండల దగ్గర 58 ఎకరాల్లో ఉన్న ఆ భారీ సరస్సులో కృత్రిమంగా చిన్న చిన్న ద్వీపాల్ని రూపొందించి అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా మలిచాడు. అక్కడ ఓ యాంఫీథియేటర్, పిల్లల పార్కు అభివృద్ధి చేసి చెరువును సంరక్షించాల్సిన బాధ్యత గురించి పాఠశాల విద్యార్థులకు చెబుతూ ఓ పచ్చదండును సిద్ధం చేసేశాడు. మూకావెరీ తర్వాత మరో ఆరు సరస్సులను పునరుజ్జీవింపజేశాడు. ఏడో చెరువు పనులు మొదలెట్టేశాడు. ఓ పక్క అడవి విస్తరణకు, వైవిధ్యానికి ఆలోచనలు చేశాడు. నలభై వేల అలోవీరా మొక్కల్ని, వెదురు ఆకుల ద్వారా పెరిగే పుట్ట గొడుగుల పెంపకాన్ని మిత్రులకు అప్పగించేశాడు. మొత్తం సేలం ప్రజల్లో, సమీప గ్రామస్తుల్లో పర్యావరణం, సమాజంపై గొప్ప చైతన్యం తెచ్చాడు. అతడు ప్లాస్టిక్‌ను తొలగించలేదు, సాటివారి బుర్రల్లో ఉన్న బూజును బూడిద చేశాడని తోటి కార్యకర్తలు చెబుతుంటారు. మూకావెరీలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాల్ని నిమజ్జనం చేయడాన్ని ఆపలేకపోయాయని పౌరుడిగా తన పర్యావరణాన్ని కాపాడలేకపోయానని, కోర్టులో సరెండర్ పిటిషన్ వేసి వినూత్నంగా నిరసన తెలిపాడు. ఓ నిక్కరు, టీషర్టు, రబ్బర్ చెప్పులతో అడవిలో కలియతిరుగుతూ చెట్లను మురిపెంగా తాకే ఈ 39 ఏళ్ల మనుష్‌కి ప్రకృతికి అంకితమవడమంటే అదో అదృష్టమనే భావన. తనలాగే పట్టణాల్లోని కుర్రాళ్లు గ్రామాలకు వచ్చి పర్యావరణ హిత వ్యాపారాల్ని చేయాలని కోరుతున్నాడు.



కార్టూన్ పంచ్

త్వరలో ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్!!
?!
గంగాధర్


రాజధాని ప్రాంతం
హరితాంధ్రప్రదేశ్‌గా మారుస్తా!!
?!


అంగన్‌వాడీ వర్కర్లు


తృప్తిగా తినండి బాస్!!
కార్పొరేట్లకు

అట్టమీది కథ



యురేకా అంటార్కిటికా

అజయ్ కుమార్ వారాల
9502395077

ఏపేరిట మహా సముద్రాలు ఉంటేనేమి ఆ జలాలే హద్దు అనుకున్నారు. ఆ తర్వాత భూభాగమనేది భ్రాంతి అని కొట్టిపారేశారు. స్వర్గాలుంటాయని కల్పనలు జోడించారు. నీరంతా అనంతంలోకి జారిపోతుందని ఊహల్ని విహరింపజేశారు. దాని తలపే లేకుండా ప్రపంచ యాత్రలు చేపట్టారు. భూమంతా తిరిగేశామని భ్రమకు లోనయ్యారు. కానీ ఓ విస్తారమైన మంచు ఖండం మిగిలే ఉందని తెలీదు. క్రీ.పూ. 350లో అరిస్టాటిల్ టెర్రా ఆస్ట్రేలీస్ అని తన మెటరాలజీ గ్రంథంలో పేర్కొంది దీని గురించే అంటారు. క్రీ.శ.2వ శతాబ్దిలో మేరినెస్ ఆఫ్ టయర్ మ్యాపుల్లో కనిపించిన మాయా ఖండం ఇదేనని నసుగుతారు. చీకటి ఖండంగా ఆఫ్రికాను, ఇండియా అనుకొని అమెరికాను, చుట్టూ తిరిగి భారత్‌ను, చివరకు దారి తప్పి ఆస్ట్రేలియాను ఏదో తామే కొత్తగా కనిపెట్టామని ప్రగల్భాలు పలికిన యూరప్ నౌక వీరులకు దీని దర్శన భాగ్యం దొరకలేదు. కనీసం కాలు మోపేందుకు అవకాశం చిక్కలేదు. తొలుత దీని సమీపాన తిరగాడింది భారీ చేపల్ని వేటాడే నౌకా బృందాల వారే. ఇదో ఖండమనే సంగతి తొలిసారి రష్యాకు చెందిన వోస్టాక్ నౌక కెప్టెన్ వాన్ బెల్లింగ్‌షామున్ ద్వారా 1820లో ప్రపంచానికి తెలిసింది. మిర్నీ-ఫింబాల్ ఐస్‌షెల్ఫ్‌గా తర్వాత పేరు పెట్టిన ప్రాంతానికి అతి చేరువగా వచ్చి దాని జాడ తెలిపారు. ఆ తర్వాత అమెరికాకు చెందిన జాన్ డేవిస్ అనే నావికుడు హ్యూగ్స్ బే దగ్గర దిగి తొలి అడుగు వేసిన వ్యక్తిగా ఘనత దక్కించుకున్నాడు. అది 1821 ఫిబ్రవరి 7న చరిత్రకెక్కింది. 1841లో ప్రాణాలకు తెగించి ఎరెబస్, టెర్రర్ నౌకల ద్వారా రాస్ సాగించిన సాహసయాత్ర ద్వారా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. 1907లో ఎర్నెస్ట్ షాక్‌ల్టన్ జరిపిన నిమ్రాడ్ సాహస యాత్ర మరో మలుపు. దక్షిణ ధృవానికి 1911లో చేరుకున్న తొలి మానవుడిగా నార్వేకు చెందిన రోల్డ్ అముండ్సన్ చరిత్రలో నిలిచిపోయాడు.ఇలా అక్కడి ఏ సంగతైనా అంతరిక్ష విషయాలంత అత్యంత ప్రాముఖ్యమైనవే.

> వేల మీటర్ల పర్వతాల్ని కప్పేస్తూ లక్షల ఏళ్ల నాటి మంచు దుప్పట్లు కప్పుకున్న ఖండం. మంచు యుగాల రాకపోకల్లో దారి తప్పి శాశ్వతంగా గడ్డకట్టుకుపోయిన అతి శీతల మేఖల. మొత్తం భూగోళానికే ఎయిర్ కండిషనింగ్ చేస్తూ భూ వాతావరణాన్ని శాసిస్తున్న ధృవపు ప్రాంతం అంటార్కిటికా లేని భూమి మరోలా ఉండేది. అంతరిక్షం నుంచి చూస్తే మంచు కలకండలా తోచే దీని విషయాలన్ని విస్మయాలే. దాని విశేషాలన్ని విలక్షణాలే.

ఎవరిది అంటార్కిటికా?

అది ఎవరిదీ కాదు, అలాగే అందరిదీనూ అని అంతర్జాతీయ ట్రీటీలో పేర్కొన్నారు. కేవలం శాస్త్ర పరిశోధనలకు తప్పితే ఆ ఖండంపై మనిషి ఆధిపత్యం ఉండకూడదని పేర్కొంది. అంటార్కిటాలోని కొన్ని భూభాగాల్ని తమ సొంతమన్న అర్జంటీనా, ఆస్ట్రేలియా, నార్వే, చిలీ, ఫ్రాన్స్, గ్రేట్ బ్రిటన్, న్యూజిల్యాండ్, బెల్జియం, జపాన్, అమెరికా, రష్యా, దక్షిణాఫ్రికా తదితర

దేశాలు వాషింగ్టన్ డీసీలో 1961లో ఏర్పాటు చేసిన సౌమిత్ర సమావేశంలో అంటార్కిటికా ట్రీటీని ఆమోదించాయి. ఆ తర్వాత 48 వరకు దేశాలు ట్రీటీపై సంతకం చేశాయి. భూభాగంపై దేశాల హక్కుల్ని రద్దు చేశాయి. కానీ ఇక్కడ ఓ బిడ్డ పుట్టి పౌరసత్వం ప్రశ్నను లేవనెత్తాడు. అర్జెంటీనా మిలిటరీ కెప్టెన్ అయిన పాల్మా దంపతులకు పుట్టిన బిడ్డే అతడు. కెప్టెన్ భార్య గర్భవతిగా ఉన్నప్పుడు ఎస్పరాంజా బేస్‌కు వెళ్లింది. అక్కడే ఆమె కాన్పు జరిగి అంటార్కిటాలో పుట్టిన తొలి మానవ బిడ్డగా రికార్డైంది. 1979లో పుట్టిన ఆ మగ బిడ్డ పేరు ఎమిలె మార్కో పాల్మా. ఆ తర్వాత చిలీకి చెందిన మహిళ కూడా బిడ్డకు జన్మనిచ్చింది. ఇలా ఒక్కో దేశం రేసులోకి ఎంటరవడంతో కొత్త చిక్కులు వచ్చిపడ్డాయి. అక్కడ బడులు కూడా నెలకొల్పాయి చిలీ, అర్జంటీనా. అంటార్కిటికా కోస్తా ప్రాంతాల్లో అపారమైన సహజ వాయువు, కోల్ నిక్షేపాలున్నాయని తేలింది. కానీ ఒప్పందం ప్రకారం 2041 వరకు వాటిని వెలికి తీసే హక్కు ఎవరికీ లేదు.

జీవం మనుగడ, ఖనిజ సంపద, వాతావరణ ప్రభావాల గురించి పరిశోధనలు జరిపేందుకు ఇప్పుడు అక్కడ యాభైకి పైగా వివిధ దేశాల బేసులు ఉన్నాయి. వీటిని చేరేందుకు కింగ్ జార్జ్ ద్వీపం వరకు ఆకాశమార్గాన రావొచ్చు. అక్కడి నుంచి బేస్‌లకు ఐస్ బ్రేకర్ నౌకలు, లేదా మంచు వాహనాల సాయంతో చేరుకుంటారు. వేసవి (అక్టోబర్–నవంబర్, మార్చి–ఏప్రిల్)లో 5 నుంచి 8 వేల మంది, చలికాలంలో 1000 నుంచి 3000 వేల మంది శాస్త్రవేత్తలు, పరిశోధకులు, సిబ్బంది ఉంటారు. ఒక్క అమెరికాకు చెందిన మెక్ ముర్డోస్ బేస్‌లోనే వేయి మంది ఉంటారు. అంతర్జాతీయ మిత్ర సైన్యాలు గస్తీ కాస్తుంటాయి.

ఇలా బతికేది..

ఎప్పటికప్పుడు వస్తున్న సాంకేతికాభివృద్ధిని





అంటార్కిటాలో వినియోగిస్తుంటారు. స్పేస్ సైన్స్ అవసరాల కోసం ఎలా ప్రత్యేక ప్రాజెక్ట్‌ల ద్వారా దుస్తులు, శస్త్ర చికిత్సలు, వాహనాలు, క్యాంప్ సైట్‌లు, శక్తి ఉత్పాదన, ఆహారం, భద్రత తదితర అంశాలకు సంబంధించిన వస్తువులు, పరికరాలకు రూపకల్పన చేస్తారో అలాగే అంటార్కిటికా కోసం పనిచేస్తారు. నివాసాలు షిప్పింగ్ కంటైనర్లను తలపిస్తాయి. పెద్ద పెద్ద ఉక్కు బాక్సుల్ని నేల మీది మంచు తగలకుండా కొన్ని అడుగుల ఎత్తులో ఏర్పాటు చేస్తారు. దీని వల్ల ఉష్ణ నష్టం తగ్గుతుంది. బయటి నుంచి చూడ్డానికి ఇవి డబ్బాల ఉన్నా లోపల మాత్రం వీలైనంత సౌకర్యవంతంగా ఉంటాయి. ఒక్కో బేస్‌లో వంద మందికి పైనే సౌకర్యవంతంగా గడపగలిగేలా అన్ని అవసరాలు తీర్చేలా స్పేస్‌లు ఉంటాయి. శాస్త్రీయ పరిశోధనలకు అధునాతన ల్యాబ్‌లు ఉంటాయి. జిమ్‌లు, లైబ్రరీలు, కిచెన్, దూంగాలని పిలిచే బెడ్రూమ్‌లు, సిట్టింగ్ రూమ్‌లతో పాటు సర్వం ఓ మెట్రో ఫ్లాట్‌లను తలపిస్తాయి. బయట అడుగు పడితేనే కష్టాలు మొదలవుతాయి. ఫీల్డ్‌లోకి వెళ్లే పరిశోధకులు శరీరంలో అణువంత కూడా అక్కడి వాతావరణానికి ఎక్స్‌పోజ్ కాకుండా దుస్తులు ధరిస్తారు. ఇవి చాలా ఖరీదైనవి. ఎడారి కంటే పొడి వాతావరణం ఉండే అక్కడి పరిస్థితులకు అలవాటు పడకపోతే ముక్కు నుంచి రక్తం కారడం, పై చర్మం బిగుసుకుపోయి గడ్డకట్టడం వంటివి మామూలే. ఒక్కోసారి మాస్కులు వేసుకోనిదే క్షేత్రాలకు వెళ్లరు. చుట్టూ మంచే ఉన్నా నీటి లభ్యత చాలా తక్కువ. మంచును నీటిలా మార్చడానికి ప్రత్యేక వ్యవస్థ ఉంటుంది. డీజిల్ జనరేటర్ల సాయంతో విద్యుదుత్పాదన చేస్తారు. ఒకప్పుడు మెక్ ముర్డో స్టేషన్‌కు అణు ప్లాంట్ ద్వారా విద్యుత్ అవసరాల్ని తీర్చేవారు. కానీ ట్రీటీ తర్వాత దాన్ని నిలిపివేశారు. స్కాడ్‌లనే మోటార్ బైక్‌ల సాయంతో తిరుగుతుంటారు. పక్కా టెలీ కమ్యూనికేషన్ వ్యవస్థే ఇక్కడ ప్రాణాధారం. సుదూరాలకు వెళ్లి పరిశోధనలు సాగించేవారికి మంచు తుఫాన్లు, క్రివాస్సే ప్రమాదాలు, గ్లేసియర్ నడక తప్పిదాలు వంటి సమయాల్లో వెంటనే స్పందించి సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించడానికి ఇదే కీలకం. రెండు రోజులకు ఓ సారి 2 నిమిషాల స్నానాలు చేయాల్సి ఉంటుంది. ఆహారం, విందు అవసరాలకు నెలలకు సరిపడా నిల్వలు ఉంచుకుంటారు. మామూలు మెనూ లాగించొచ్చు. కానీ ఒక్కోసారి క్యాంపులు వేసేవారు రోజుల తరబడి బేస్‌లకు దూరంగా ఉండాల్సి వస్తుంది. పిరమిడ్ ఆకారంలో ఉండే టెంట్లు ఉపయోగిస్తారు. ఇవి గాలి ఉధృతిని, ఉష్ణ నష్టాన్ని తగ్గిస్తాయి. ఆ సమయంలో వారిని ఆదుకునేది హూష్ అనే అంటార్కిటికా వంటకమే. పెమ్మికన్ మాంసపు ముద్దలు, స్లెడ్జింగ్ బిస్కట్లు, మంచు గడ్డల్ని కలిపి వండే ఈ ఆహారాన్ని తేలిగ్గా తయారుచేసుకోవచ్చు. రుచికరంగాను ఉంటుంది. అకస్మాత్తుగా వచ్చే ఈదురు గాలులకు, వైటౌట్

క్లుప్తంగా లెక్కలు..

- అంటార్కిటికా వైశాల్యం కోటీ 38 లక్షల 29 వేల 430 చ.కి.మీలు. ఇది ఆస్ట్రేలియాకు సుమారు రెండింతలు.
- ఇక్కడి రాస్ ఐస్ షెల్ఫ్ ఫ్రాన్స్ అంత పెద్దగా ఉంటుంది. ఇది 5 లక్షల 10 వేల 680 చ.కి.మీల మేర విస్తరించింది. దీని నుంచే ఐస్ బర్గ్‌లు విరిగి సముద్రంలో తేలుతుంటాయి.
- అంటార్కిటికా భూభాగాన్ని చీలుస్తూ వెళ్లే ట్రాన్స్‌అంటార్కిటిక్ పర్వత శ్రేణి 3,300 కి.మీ.ల పొడవున ఉంటుంది.
- ఇక్కడ ఎత్తైన పర్వతం మౌంట్ విన్సెంట్ (4,892 మీ.)ఎత్తున ఉంటాయి.
- అంటార్కిటికా భూభాగంపై పరుచుకున్న మంచు పొరలు సరాసరి 1829 మీటర్ల మందంతో ఉంటాయి.
- అత్యంత మందమైన మంచు పొర ఎవరూ నమ్మలేనంతగా 4,776 మీటర్లు.
- ఈ మంచు పొరల వద్దే ఏకంగా 247 లక్షల చదరపు కి.మీ.ల మేర మంచు ఉంటుంది.
- వేసవిలో – 27.5 డిగ్రీలు, చలి కాలంలో – 60 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు సాధారణం కిందకు వస్తాయి.
- భూమిపై అతి తక్కువగా –89 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత రికార్డు అయిన వోస్టాక్ స్టేషన్ ఇక్కడిదే.
- అంటార్కిటికా ఓ ఎడారి. సహారా ఎడారి కన్నా తక్కువ తేమశాతం ఉంటుంది.
- రాస్ సముద్రం, వెడెల్ సముద్రం, స్కాటియా సముద్రం, డ్రేక్ సముద్రం ఈ ఖండానికి చెందినవి. ప్రయాణించేందుకు ప్రపంచంలోనే అతి ప్రమాదకరమైన, కష్టతరమైన సముద్ర జలాలుగా ఇక్కడి డ్రేక్ పాస్‌ను చెబుతారు.

ఎందుకింత చల్లగా...

భూమి కొంచెం వంగి భ్రమణం చేయడం వల్ల సూర్య కిరణాల తాకిడి కొంచెం తక్కువగా ఉంటుంది. సముద్ర మట్టానికి సరాసరిన 2,400 మీటర్ల ఎత్తున ఉండటం ప్రధాన కారణమే. 30 మీటర్ల ఎత్తుకు 1 డిగ్రీ సెంటీగ్రేడ్ చొప్పున ఉష్ణోగ్రత తగ్గుతూ వస్తుంది.



ఎఫెక్ట్ ప్రభావాల వల్ల ప్రమాదాల్లో పడకుండా ఒక వైర్‌కు అనుసంధానంగా నడక సాగిస్తారు. ఇది బృందం నుంచి వేరుపడకుండా తప్పిపోకుండా చేస్తుంది. పక్కా జీపీఎస్ అనుసంధాన వ్యవస్థతో ఏ సభ్యుడు ఎక్కడ ఉన్నాడో ఎటు వైపు సాగుతున్నాడో గుర్తిస్తారు. మానసిక, భావోద్వేగ సమస్యలకు అవకాశం ఉండటంతో రిక్రియేషన్ యాక్టివిటీస్ బానే సాగుతాయి. వీకెండ్ సమయంలో గానీ, వీలైతే రోజు రాత్రుళ్లు వివిధ థీమ్‌ల్లో సరదాగా గడుపుతారు. చిన్న పాటి శస్త్రచికిత్సలు చేసేందుకు కూడా వైద్య బృందం అందుబాటులో ఉంటుంది. క్లీనింగ్, వాక్యూమింగ్, వంట పని వంటి వాటిని రోస్టర్లు వేసుకుని బృందం నిర్వర్తిస్తుంది. ఒక వ్యక్తి బేస్‌లో ఉన్నాడంటే కొన్ని లక్షల రూపాయల ఖర్చు అవుతుంది. అందువల్లే వీలైనంతగా రోజువారీ పనులను పంచుకుంటారు. చాలా పొదుపుగా ఆహారాన్ని, టాయిలెటరీలను వాడతారు. ఇక్కడ హైడ్రోపోనిక్స్ విధానంలో కూరగాయల్ని పెంచుతారు. బేసుల్లో పోగుబడే చెత్తను రీసైకిల్‌కు పంపించగా మిగిలిపోయిన వాటిని ఎప్పటికప్పుడు దహనం చేసేస్తారు. ఇక్కడి చలిని తట్టుకుని వాతావరణానికి అలవాటు పడేందుకు గగుర్పాటుగా అనిపించే స్నానం చేస్తారు. మంచు పొరను తొలగించి నీటి గుండం చేస్తారు. దుస్తులన్నీ తీసేసి అందులో దూకుతారు. కాసేపు అందులో ఉండి వెంటనే బయటకు వచ్చి వేడినీటి టబ్ సానాలోకి చేరతారు. మళ్లీ నీటి గుండంలోకి వెళతారు. కానీ, దుస్తులతో గుండంలోకి దిగి పైకి వచ్చారో ఇక అంతే. శరీరానికి కరుచుకుని అవి గడ్డకట్టుకుపోతాయి. ఇది చాలా ప్రమాదకరం. ఎండాకాలంలో కలిగే హైపోథెర్మియా ప్రభావం పడుతుంది. ప్రయాణానికి ముందే పూర్తి శిక్షణనిస్తారు. పూర్తి ఆరోగ్యంగా ఉన్నవారినే ఎంచుకుంటారు.

భారత్ ఓ ముక్క.

ఆఫ్రికా, భారత ఉపఖండం, ఆస్ట్రేలియా, దక్షిణ అమెరికా మృత్తిక తీరు అంటార్కిటికాకు దగ్గరగా ఉంటుందని శాస్త్రవేత్తల అభిప్రాయం. ఒకప్పుడు గోండ్వానాల్యాండ్‌గా అతుక్కుని ఉన్న ఈ ఖండాలన్ని ఆ తర్వాత భూఫలకాల గమనంతో దూరంగా జరిగిపోయాయి. కొన్ని మిలియన్ ఏళ్ల క్రితం జరిగిన ఈ పరిణామాల సమయంలో అంటార్కిటికా వెచ్చగా ఉండేది. సుమారు 34 లక్షల ఏళ్ల క్రితం దక్షిణ మూలగా వచ్చేసిన ఇది చల్లబడటం మొదలైందని లెక్కలు. ప్లీటోసీన్ మంచు యుగం నాటికి పూర్తిగా గడ్డకట్టుకుపోయింది.

జంతు మాయాజాలం

శరీరంలోని కణాలు సైతం గడ్డకట్టుకుపోయేంత శీతలంగా ఉండే అంటార్కిటికాలో ప్రాణి మనుగడ పెద్ద ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వోస్టాక్ బేస్ కింద 1.4 కిలోమీటర్ల అడుగున ఉన్న సబ్‌గ్లేసియల్ సరస్సు నుంచి శాంపిళ్లు సేకరించిన కెనడా శాస్త్రవేత్తల బృంద పరిశోధనలో ఊహించని వాస్తవాలు వెలుగుచూశాయి. అక్కడ సూక్ష్మజీవులు యథేచ్ఛగా మనగలగుతున్నాయని తేలింది. జ్యూపిటర్ ఉపగ్రహం అయిన ఐరోపా తీరు ఈ సబ్‌గ్లేసియల్ సరస్సు తీరు ఒకేలా ఉంటుంది. గోండ్వానాల్యాండ్ విడిపోయే సందర్భంలోను ఈ ఖండం మీద కార్నిఫెరస్ వంటి వృక్షజాతులుండేవి. వీటికి ఆధారంగా నాతో ఫాగస్ ష్రబ్‌ల శిలాజాలు బయటపడ్డాయి. ఇవి 3-4 మిలియన్ ఏళ్లనాటివి. భూమ్మీద మనగలిగిన అతి పెద్ద రాక్షసబల్లుల స్వైర విహారం అంటార్కిటికాలోను చోటుచేసుకుందనే దాఖలాలున్నాయి. ఇప్పటి వరకు అంటార్కిటికాకే చెందిన మూడు రాక్షసబల్లుల జాతుల్ని గుర్తించారు. క్రయోలోఫసారస్, గ్లేసియాలైసారస్, అంటార్కిటికోపెల్టాలే అవి. ఇప్పుడు క్షీరదాలు ఉన్నా అవి వెన్ను లేనివే. అది గూడా కొన్ని మిల్లీమీటర్ల పరిమాణంలో ఉంటాయి. యాంటీ ఫ్రీజ్ అనే టెక్నిక్ ద్వారా శరీర ద్రవాలు, కణాలు గడ్డ కట్టుకుపోయే సమయంలో చలనం లేకుండా ఉండిపోతాయి. ఉష్ణం పెరిగాక మళ్లీ తేరుకుని జీవిస్తుంటాయి.

క్రిల్‌లే జీవాధారం

ఇంతటి దారుణమైన మంచు ఎడారిలోను జీవవైవిధ్యం కనిపిస్తోందంటే దానికి కారణం రొయ్యలను పోలి ఉండే క్రిల్ అనే జీవులే. భారీ తిమింగలాలు సైతం వీటి మీదే ఆధారపడి జీవిస్తున్నాయి. వీటి గుంపు కొన్ని లక్షల సంఖ్యలో ఉండి ఏకంగా కొన్ని కిలోమీటర్ల విస్తీర్ణంలో

పరిశోధనల పీఠభూమి

నాసా మార్స్‌కు పంపిన వైకింగ్ రోవర్‌ను అక్కడి పరిస్థితులకు తట్టుకుంటుందో లేదోనని పరీక్షించింది అంటార్కిటికాలోనే. ఈ ఖండం లోని పొడి లోయలు(డ్రై వ్యాలీస్). మార్స్ ప్రాంతం, వాతావరణాన్ని పోలి ఉంటుంది. ఇదే కాదు, అంతరిక్షం నుంచి భూమి గుండా వెళ్లగలిగే న్యూట్రినోలను జల్లెడ పట్టేందుకు భూమికి 2 కి.మీ. లోతున అముండ్సన్-స్కాట్ స్టేషన్ దగ్గర ప్రపంచంలోనే అతి పెద్ద న్యూట్రినో డిటెక్షన్ టెలిస్కోప్‌ను ఏర్పాటు చేశారు. ఇదే కాదు అంతరిక్షం నుంచి భూమి మీదకు పడే మెటరైట్లకు ఇది నిధి. విశ్వం పుట్టుకకు గురించి వాస్తవాలు తెలుసు కోవాలంటే వీటిపై పరిశోధనే అతికీలకం. మన దేశంతో పాటు ఎన్నో దేశాల నిపుణులు ఇక్కడ బేస్‌ల నుంచి పనిచేస్తారు.



పెంగ్విన్ ఎలా కింగ్..

అంటార్కిటికాలో 200 కి.మీల వేగాన వీచే చలిగాలులు, - 30 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలతో మనుషులు గడ్డకట్టుకుపోయే పరిస్థితుల్లోను పెంగ్విన్లు గుడ్లుపొదగలవు. వాటి శారీరక నిర్మాణంలో ఈకలతోపాటు చర్మం కింద నిల్వ ఉన్న కొవ్వే వీటిని చలి నుంచి కాపాడతాయి. పెటె మిరబైల్ అనే విధానంలో శరీరంలోని వేడి రక్తాన్ని ఎక్స్‌చేంజ్ చేసుకునే పెంగ్విన్ల ఫ్లిప్పర్లు, పాదాల చలనానికి అవసరమైన కండరాలు చలి వల్ల బిగదీసుకుపోకుండా కొవ్వుతో నిండిన భాగాల కింద ఏర్పాటు ఉంటుంది. వాటి చిన్న పాటి ఈకలు దట్టంగా పరుచుకుని చక్కని ఉష్ణ ఇన్సులేటర్లలా పనికొస్తాయి. ఉష్ణం కోల్పోకుండా వేల సంఖ్యలో ఒకదాని పక్కన ఒకటి పెంగ్విన్లు గుంపుగా చేరి షిఫ్టుల ప్రకారం మందలో వాటి స్థానాల్ని మార్చుకుంటూ చలికాచుకుంటాయి. ఒక్కో గుంపు 6000లకు పైమాటే. నెలలపాటు అలాగే నిలబడిపోతాయి. వాటి శ్వాస వ్యవస్థ కూడా నిశ్వాస సమయంలో కోల్పోయే ఉష్ణంలో 80 శాతాన్ని నిలుపు కుంటాయి.

పోగుబడి ఉంటాయి. అంటార్కిటికా కన్వర్జెన్స్ అనే శీతల, ఉష్ణ సముద్ర జలాల సంగమం ప్రభావంతో అట్టడుగున ఉన్న నీరు పైకి తోడినట్టు ఉపరితలానికి చేరుకుంటుంది. ఇది ఫైటోప్లాంక్టన్‌లతో ఉండటం వల్ల క్రిల్‌లు వాటిని తిని పెరుగుతాయి. మంచు గడ్డకట్టిన సమయంలో మంచు పొర అడుగు భాగాన ఫైటోప్లాక్టన్‌లు పోగుబడి క్రిల్‌ల ఆహార కొరత తీరుస్తాయి. వీటిని రొయ్యల్లా మనుషులు చప్పరిద్దామనుకున్నారు గానీ, అదృష్టవశాత్తు అవి అంత రుచికరంగా లేక, తరలించేలోగా అవి పనికిరాక వాటిని వదిలేశారు. అయినా రష్యా, జపాన్, నార్వే వంటి దేశాలు వీటి పెంపకం మొదలెట్టి ఔషధ, ఆక్వేరియం రంగాల్లో వాడుతున్నారు. ఇది ఏటా పదివేల టన్నుల పైమాటే. ఎంపరర్, కింగ్, అడెలై, చిన్‌స్ట్రాప్, గెంట్రో వంటి పెంగ్విన్ జాతులు అవి ఉండే ప్రాంతానికి అనుకూలంగా పరిణామం చెందాయి. ఎలిఫెంట్, ఫర్, వెడెల్, క్రాబ్ ఈటర్ సీల్, లెపర్డ్ సీల్ వంటి సీల్ జాతులు ఉన్నాయి. షీత్ బిల్, టెర్న్, కేప్ పీజియన్, జెయింట్ పెట్రెల్, అంటార్కిటిక్ స్కువా వంటి పక్షిజాతులు కూడా ఇక్కడ కనిపిస్తాయి. రోటిఫెర్, టార్డిగేట్, మైట్, నెమటోడ్స్ వంటి 67 రకాల చిన్ని జీవులు ఇక్కడి భూప్రాంతాన మనుగడ సాగించగలుగుతున్నాయి. సాండ్ బ్లాస్ట్ ఎంత తీవ్రంగా ఉంటుందో దానికన్నా ఇక్కడి చలిగాలులు ఐస్ బ్లాస్ట్ ఎఫెక్ట్‌ను తీసుకొస్తాయి. అందుకే ఎగిరే కీటకాలు, చీమలు ఇక్కడ ఉండవు. ఆర్కిటిక్‌లో రాజ్యమేలే ధృవపు ఎలుగుబంటి ఇక్కడ మనుగడ సాగించలేదు.

అగ్నిపర్వతాలతోను ముప్పే..

అంటార్కిటికాలో క్రియాశీలక అగ్నిపర్వతాలున్నాయి. వాటిలో మౌంట్ ఎబెరెస్ (3,794 మీ.) పెద్దది. డిసెప్షన్ ద్వీపంలో మరో అగ్ని పర్వతం ఉంది. ఇది చివరిసారిగా 1970లో భారీస్థాయిలో బద్దలైంది. వీటి లావా అక్కడి మంచు దొంతరలను కరిగించడంతో హిమానీనదాలు (గ్లేసియర్‌లు) ప్రవహిస్తాయి. వీటి కదలికల వల్ల ఓ చైన్ రియాక్షన్‌లా వందల కిలోమీటర్ల మేర వందల అడుగుల లోతున పగుళ్లు (క్రివాసేస్) ఏర్పడుతాయి. మంచు కరిగి సముద్ర మట్టాలు ప్రమాదకరంగా పెరగడానికి అగ్నిపర్వతాలు కూడా కారణమనే వాదన ఊపందుకుంది. ఇక్కడి కాసెర్డ్ ఎక్స్యూడ్స్ అగ్నిపర్వతం ఏటా 70 మిలియన్ టన్నుల నీటిని కరిగిస్తోందని ఓ అంతర్జాతీయ శాస్త్రీయ సంస్థ నివేదిక. భూ అంతర్భాగం నుంచి ఉపరితలానికి వ్యాప్తి చెందే ఉష్ణంలోను అధికస్థాయి ఈ ఖండంలోనే నమోదైంది.



ప్రపంచవ్యాప్తంగా సుమారు 34,000 కేంద్రాల నుంచి నమోదు చేసిన ఉష్ణోగ్రతల్లో 99 శాతం ప్రాంతాల కన్నా ఇక్కడే అధికం. ఈ లెక్కలన్నీ 2013 జనవరి 31న విలియమ్స్ సబ్‌గ్లేసియల్ సరస్సు దగ్గర జరిపిన పరిశోధనలో తేలింది. ఒక్క దక్షిణ అంటార్కిటికాలోనే 60 అంతర్భాగ సరస్సులున్నాయని అంచనా. టెక్సాస్ యూనివర్సిటీకి చెందిన డంకన్ యంగ్ అనే గ్లేసియాలజిస్ట్ థ్వైట్స్ గ్లేసియర్ వద్ద జరిపిన పరిశోధనలో మరిన్ని భయంగొలిపే అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఐస్ పెనిట్రేటింగ్ రాడార్ సాయంతో అక్కడ అయస్కాంత వైచిత్రులను నమోదు చేశారు. గ్లేసియర్ అడుగు భాగాన మూడుకు మించి క్రియాశీలక అగ్నిపర్వతాలున్నాయి లెక్కగట్టారు. మొత్తం అంటార్కిటికాలో ఇవి వందలాదిగా ఉండొచ్చనే వాదనకూ తెరతీశారు. మొత్తం ఖండమే రెండుగా చీలేలా శక్తివంతమైన పేలుళ్లు జరిగే అవకాశముందని సందేహిస్తున్నారు.

మనిషి దెబ్బ

తిమింగలాలు, సీల్ చేపల వేట, ముఖ్యంగా పాటాగోనియన్ టూత్ ఫిష్ వేటతో మానవుడు పెద్ద ఉపద్రవాన్ని తెచ్చిపెట్టాడు. ఆ తర్వాత సందర్శకుల తాకిడి ఎక్కువై సూక్ష్మ క్రిములు ఇక్కడి వాతావరణంలోకి ప్రవేశించి ఇక్కడి జీవాలకు ప్రాణాంతక రోగాల ముప్పు తెచ్చిపెడుతున్నాయి. ముఖ్యంగా కుక్కలకు వచ్చే డిస్టెంపర్ అంటువ్యాధి ముప్పు సీళ్లకు, పెంగ్విన్లకు వ్యాపించే అవకాశముందని తేలడంతో స్లెడ్జ్ బళ్ల కోసం తెచ్చుకున్న వాటిని ఆ ఖండం నుంచి వెనక్కు పంపించేశారు. 1899లో తొలిసారిగా గ్రీన్‌ల్యాండ్ హస్కీ జాతికి చెందిన 75 స్లెడ్జ్ డాగ్స్‌ను తెచ్చారు. నౌకల వల్ల ఆయిల్ స్పిల్ అయ్యి చాలా ప్రమాదాలు జరిగాయి. గ్లోబల్ వార్మింగ్ వల్ల 2.5 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత పెరిగి క్రిల్‌లకు ప్రాణ నష్టం ఎక్కువైంది. మనిషి వాడకంతో క్లోరోఫ్లోరో కార్బన్‌ల కాలుష్యంతో ఓజోన్ పొర అంటార్కిటికా అంతా పరిమాణంలో దెబ్బతింది. ఏటా నలభైవేల వరకు పర్యాటకులు సందర్శించడం కూడా ముప్పే.

✦

వైటౌట్ మాయలు.. నునాటక్ అతిశయాలు

ఇక్కడ వైట్ ఔట్ అనే ప్రకృతి వైచిత్రి ఉంటుంది. ఎటూ చూసినా తెల్లటి రంగే తప్ప మరోటి కనబడదు. చూపు కుట్టే తెల్లదనం ప్రమాదకర భ్రాంతుల్ని కలిగిస్తుంది. అడుగుల దూరంలో ఉన్న వస్తువును వందల మీటర్ల దూరంలో ఉన్న మరో వస్తువుగా పొరబడతారు. వందల అడుగుల కిందనున్న లోయ కూడా చదునుగా ఉన్నట్టుంటుంది. అడుగు పడితే అంతే. ఇదే కాదు దక్షిణ ధృవపు అయస్కాంత క్షేత్రంలో మార్పుల వల్ల ఆకాశంలో అరోరా ఆస్ట్రేలిస్ అనే వింత కాంతులు కనిపిస్తాయి. తేమ, నీరు గాల్లో గడ్డ కట్టి వజ్రాల రీతి, కాంతితో నేల కురుస్తాయి. దీన్ని డైమండ్ డస్ట్ అంటారు. పర్వతం, దాని చుట్టు పక్కల ప్రాంతమంతా మంచుతో కప్పబడి కేవలం శిఖరం మాత్రమే నేలపై పొడుచుకు వచ్చినట్టు కనిపించే వైచిత్రినే నునాటక్ అంటారు. వీటి మీద మంచు లేకపోతే పక్షులు గూళ్లు కట్టుకుంటాయి.

విశేషాలు-విడ్డూరాలు

- బూ బూ అనే స్లెడ్జ్ డాగ్ 10, 474 టన్నుల ఆహారాన్ని తరలించింది. 10 వేల మైళ్ల తిరిగింది.
- 2000లో ఓ పెద్ద ఐస్ బర్గ్‌ను గుర్తించారు. దాని పొడవు 295 కి.మీ. కాగా వెడల్పు 35 కి.మీ.లు. 11 వేల చదరపు కి.మీ. విస్తీర్ణంలో ఉన్న అది ఖతార్ కన్నా పెద్దది.
- మంచు భారంతో ఉపరితలం కుదించుకుపోయి ఇక్కడి భూమిపై మంచంతా కరిగిపోతే పది వేల ఏళ్లలో 500 మీటర్ల ఎత్తుకు దీని భూభాగం పైకి తన్నుకు వస్తుంది.
- ఒక్క నీలి తిమింగలం రోజుకు 3600 కేజీలుండే 40 లక్షల క్రిల్‌లను లాగించేస్తుంది.
- చలికాలంలో రోజుకు లక్ష కిలోమీటర్ల మేర సముద్రం మంచు గడ్డకడుతుంది. ఆ కాలంలో రెండింతల సముద్రం గడ్డకడుతుంది.
- హెమోగ్లోబిన్ లేని పారదర్శక రక్తమున్న చేపలు ఇక్కడి జలాల్లో ఉన్నాయి.
- కోటి టన్నులున్న క్రిల్‌ల గుంపును 1981లో గుర్తించారు. ఇది యూకే, జర్మనీలు కలిపినంత సైజులో ఉంటుంది.
- అంటార్కిటికాలో 10 శాతం మంచు కరిగితే ప్రపంచంలోని చాలా లోతట్టు ప్రాంతాలు నీటిపాలౌతాయి. అంతా కరిగితే సముద్ర మట్టాల ఎత్తు ఇప్పటి కన్నా 60-65 మీటర్ల ఎత్తుకు చేరుకుంటుంది.
- ప్రపంచంలో ఉన్న 70 శాతం మంచి నీరంతా ఇక్కడే గడ్డకట్టుకుని ఉంది. 90 శాతం మంచు అంతా అంటార్కిటికాదే.

వీధిబాలల సాథీ



రైల్వే ట్రాకుల దగ్గర చిరిగిన బట్టలతో దుమ్ము పట్టిన జుట్టుతో దీనంగా జీవచ్ఛవాల్లా కదిలే వీధి బాలల్ని గుర్తు తెచ్చుకోండి. వారిలో చాలా మంది ఒకప్పుడు తమ ఇళ్లలో గారాల పట్టీగానో, ముద్దుల బాబుగానో నిండు కళతో తిరిగినవాళ్లే. ఇంటి మీద అలిగో, చదువు భారంతోనో, దారి తప్పో, ఇంకెవరి మీదో కోపంతోనో రైలెక్కేసి మళ్లీ అమ్మ ఒడికి చేరలేనంత దూరమైపోతారు. నాన్న దగ్గరకు తీసుకోలేనంత దూరమైపోతారు. వాళ్లను తిరిగి ఇంటికి చేర్చి వేల కుటుంబాల గుండె కోతను, వ్యథను తీరుస్తున్నారు ఓ సాథీ (స్నేహితుడు). ఇంటిలాంటి చోటు మరొకటి ఉండదని అనే ఈ సాథీ ఇప్పటి వరకు 47 వేల మంది చిన్నారులను కాపాడారు.

గృహ హింస, లైంగిక వేధింపులు, పేదరికం వంటి కారణాలున్నా చాలా వరకు చిన్న చిన్న విషయాలే పెద్ద నిర్ణయాలు తీసుకునేలా చేస్తాయి. ఇలా ఇళ్ల నుంచి పారిపోయి వచ్చిన 90 శాతం మంది తిరిగి ఇంటికి వెళ్లే ఆలోచన చేస్తారు. కానీ ధైర్యం చేయలేరు, వారిని చేర్చే మార్గాలు కనబడవు. వెంటనే అక్కున చేర్చుకుని ఇంటికి వెళ్లే పరిష్కారం చెబితే చాలా జీవితాలు, ఎన్నో కుటుంబాలు వేదన నుంచి బయటపడతాయి. 23 ఏళ్ల నిత్య సంఘర్షణ ద్వారా ప్రమోద్ కులకర్ణి చెప్పిన వాస్తవాలివి. వారిలో ఇంటి ఆలోచన కనుక పోతే శాశ్వతంగా చేజారే ప్రమాదం కూడా ఉందని ఆయన అంటారు. లైంగిక దాడి, మాదక ద్రవ్యాల అలవాటు, అంటు రోగాలు, నేర ప్రవృత్తి వంటి వాటి బారిన పడి భవిష్యత్తు అనేది కోల్పోతారు. రైల్వే ప్లాట్‌ఫామ్‌ల వద్ద పెరిగేది పిల్లల వయసే కానీ వారి జీవితం కాదని చెప్పే ప్రమోద్ ఇప్పటి వరకు 47 వేల మంది పిల్లల్ని తిరిగి వాళ్ల ఇళ్లకు చేర్చారు. అహ్మదాబాద్ ఐఐఎం పూర్వ విద్యార్థి అయిన ప్రమోద్‌ను చదువుకునే రోజుల్లో ఓ ఘటన మార్చేసింది. పూణె ఎస్ఎన్‌డీటీ బృందం నిర్వహించిన డ్రైవ్‌లో చాలామంది వీధి బాలల జీవితాల్లో మళ్లీ రావడం స్పష్టంగా గమనించిన ఆయన చదువయ్యాక తన పని అదేనని నిర్ణయించేసుకున్నాడు.

1992లో సొసైటీ ఫర్ అసిస్టెన్స్ చిల్డ్రన్ ఇన్ డిఫికల్ట్ సిచ్యుయేషన్ (సాతీ) ద్వారా తన కార్యక్రమాల్ని మొదలు పెట్టాడు. తనలాంటి ఆలోచన ఉన్నవారితో ఓ జట్టును రూపొందించుకుని తొలుత రాయ్‌చూర్ రైల్వేస్టేషన్‌లో ఉన్న వీధిబాలల్ని రక్షించాడు. వారిని ప్రభుత్వ బాలల గృహానికి తరలించి మెల్లిగా ఒక్కొక్కరి వివరాల్ని కౌన్సెలింగ్ ద్వారా కనుక్కున్నారు. పిల్లల్లో నమ్మకం సంపాదించేందుకు తల్లిదండ్రులు ఎలా సమాయత్తం అవ్వాలనే విషయమే కాక నెలరోజుల రీ ఓరియెంటేషన్ తరగతుల్ని నిర్వహించి బాలల భయాల్ని, సమస్యలకు పరిష్కారం చూపారు. ఇది విజయవంతమవడంతో మిగతా రైల్వేస్టేషన్లపై కూడా దృష్టి సారించారు. అలా కాన్పూర్, ముఘల్ సరాయ్, గోరఖ్‌పూర్, అల్లహాబాద్, అహ్మదాబాద్, పూణె, న్యూఢిల్లీ, హైదరాబాద్, తిరుపతి, యశ్వంత్‌పురా, బెంగళూర్, హుబ్లీ, గుంతకల్, మంత్రాలయం వంటి నగరాల్లోని రైల్వేస్టేషన్లలో కార్యకలాపాల్ని విస్తరించారు. స్థానిక పోలీసులు, రైల్వే పోలీసులు, అధికారులు, అమ్మకందార్లు, కూలీలు తదితరుల సహాయంతో వీధి బాలల్ని గుర్తించి హోమ్‌లకు తరలిస్తారు. ఆ తర్వాత పిల్లల పరిస్థితిని బట్టి చికిత్స చేయించడం, మత్తు అలవాట్లు పోగొట్టడం, చదువుపై శ్రద్ధ పెంచడం వంటి కార్యక్రమాలే కాక సృజనను పెంచి జీవితం మీద ఆసక్తి కలిగించేలా క్రీడలు, కళల్లో శిక్షణనిప్పిస్తారు. మధ్యాహ్న నిద్ర, ధ్యానం వంటి వాటి ద్వారా వారిలోని హైపర్ ఆక్టివిటీని తగ్గించేలా చేస్తారు. ప్రమోద్ కృషిని గుర్తించి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, సంస్థలు కలిసి పనిచేస్తున్నాయి. తిరిగి సొంతిళ్లకు చేర్చిన చిన్నారుల బాగోగులు తెలుసుకోవడం కోసం కొన్నిరోజుల పాటు నిరంతర ఇన్స్‌పెక్షన్ చేస్తారు. అంతా బాగుందని నిర్ధారించుకున్నాక ఏడాదికి నాలుగు సార్లు చొప్పున ఫోన్ కాల్స్ ద్వారా వారి బాగోగులు కనుక్కుంటుంటారు. చిన్నారితో నేరుగా మాట్లాడే వరకు వారు బాధ్యత వహించిన ముగ్గురు, నలుగురు దగ్గరి బంధువులు, పాఠశాలలు, కమ్యూనిటీలకు కూడా ఫోన్లు వెళతాయి. అవసరమైతే స్థానిక పోలీసుల ద్వారా వాకబు చేయిస్తారు. ఒకసారి ఇంటికి చేరిన తర్వాత పారిపోదామనే ఆలోచన మళ్లీ రాకుండా ఓ సౌకర్యవంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పరచడంలో తల్లిదండ్రులకు సాయం చేస్తారు.

పేదరికం, లైంగిక దాడి, గృహ హింస, అనాథల వంటి సందర్భాల్లో ప్రభుత్వ హోమ్‌ల్లోనో, మరో ఎన్‌జీవో ద్వారానో వారి భవిష్యత్తును మెరుగుదిద్దే ఏర్పాట్లు చేస్తారు. ఏటా 80 వేల మంది పిల్లలు ఇళ్ల నుంచి పారిపోయి వచ్చి సుదూరంగా ఉన్న, తెలియని ప్రాంతాల్లోని రైల్వేస్టేషన్లకు చేరుకుంటున్నారు. కనిపించిన రైలు ఎక్కేసి వారిని తల్లిదండ్రులు కనుగొనే అవకాశాన్ని అసాధ్యం చేసుకుంటున్నారు. అంతమంది చిన్నారుల జీవితాల్లో కొంత మందివి మాత్రమే తమ ద్వారా రక్షించబడుతున్నాయని చాలామంది చేజారుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తారు ప్రమోద్. తమ పునరంకిత కార్యక్రమాల్లో ఆ కుటుంబాలు అన్నాళ్లు పడిన వ్యథ ఎంత తీవ్రమైందో కళ్లారా చూస్తుంటే హృదయం చలించిపోతుందని చెప్పే ప్రమోద్, తమ ద్వారా ఓ చిన్నారి తమ కుటుంబాన్ని తిరిగి చేరుతున్నాడనే విషయం గొప్ప తృప్తి మిగులుస్తుందని చెబుతారు. క్షణికావేశంలో ఇళ్లు వదిలినవారికి తిరిగి ఇంటిని చేర్చే ధైర్యాన్ని, మార్గాన్ని అందించి నిజమైన సాతీ (మిత్రుడు) అనిపించుకుంటున్నారు ప్రమోద్. ఎంగిలి మెతుకుల కోసం వీధి కుక్కలతో పోటీ పడి చెత్తకుండీల చుట్టూ తిరిగే ఆ విషాద బతుకుల్ని చూసి జాలిపడి ఊరుకోవడం ప్రతి రైల్వేస్టేషన్‌లో కనిపించే నిత్యదృశ్యమే. రైలు పట్టాల దగ్గర జీవితం ట్రాక్ తప్పుతున్న వారి భవితను చూసి నిర్వేదం పలకడం మామూలే. కానీ ప్రమోద్‌లా స్పందిస్తే మార్పు సాధ్యమే.

పాఠం

తమిళ మూలం: వైరముత్తు
అనువాదం: ఆర్. శాంత సుందరి



నీతి వాక్యాలు చెప్పిన
మొదటి భాష ఏది?
తమిళమా? లాటినా..గ్రీకా?
కాదు... అవేవీ కాదు

ప్రకృతి
తన
నుదుటి మీద..కనుబొమల మీద
కళ్ళలో..బుగ్గల్లో
బాహుమూలాల్లో
రాసి ఉంచిన నీతినే
భాషలోకి అనువదించాడు మనిషి

పైకి ఎగబాకుతూ మండుతుంది జ్వాల
పైకి మొలకెత్తుతుంది విత్తనం
పైకి ఎగసిపోతుంది మబ్బు
పైకే పెరుగుతాడు మనిషి
అంతా పైపైకే

కిందివైపుకి కురుస్తుంది
వాన కిందికి కురియకపోతే
మరి పైకి పెరిగేది
ఈ భూమిలో ఏది?

వాన అంది:
'కరుణ కలవాడే
సమస్త ప్రాణులకీ
నాయకుడౌతాడు.'

ooo

తీరం మేలుకుని ఉందా?
నిద్రపోతోందా?
తెలీదు

పాడటం తెలిసిన పక్షులు
తమ పాటలకి తామే
తాళం వేస్తాయా?
తెలీదు

తల్లిభాషే రాని మనుషులకి
తమ పాట అర్థం అవుతుందా? అవదా?
తెలీదు

కానీ
గులకరాళ్ళని
నోట్లో నింపుకుని
నది పాడుతూనే ప్రవహిస్తుంటుంది

నది కూడా ఒక గీతావాక్యం అంది:
'కర్తవ్యాన్ని నిర్వహించు
ఫలితం కోసం ఎదురు చూడకు.'

ఎక్కే వాళ్ళందర్నీ
ఒంగి రమ్మని చెపుతుంది
దిగే వాళ్ళందర్నీ
నిటారుగా నడిపిస్తుంది

కొండ అంది:
'వినయంగా బతికితే
పైకి వెళ్తావు
విర్రవీగుతూ బతికితే
కిందికి దిగిపోతావు.'

ooo

వేర్లను పెకిలేస్తూ పారే
నది మీద కూడా
పూలని గలగలా రాల్చే
ఒడ్డునున్న కొమ్మలు...
తెంపినందుకు కోపం లేదట
తడిపినందుకు కృతజ్ఞతలట

చెట్టు అంది:
'ఎవరేం చేసినా
నువ్వు మాత్రం మంచే చెయ్యి!'

చిరునామా లేకుండానే భూమ్మీదికొస్తుంది
ఎక్కడ ఆల్చిప్ప మేలుకుని ఉంటుందో
అక్కడ పడి ముత్యంగా మారుతుంది

వాన చినుకు అంది:
'ముత్యం తాలుకు విత్తు
ఎప్పుడైనా పడచ్చు
మేలుకుని ఉండు – ఓ మనిషీ – మేలుకుని
ఉండు!'

కింద బురద
పైన పాచి
చుట్టూ కప్పల సంగీతం
అయినా
నీళ్ళల్లో జ్వాలలు పూసినట్టున్న
తామరపూలకే
సౌందర్య గంభీరం

తామరపువు అంది:
'పరిసరాల వల్ల ఘనత పొందటం సులభం
పరిసరాలకు ఘనత చేకూర్చటమే గొప్ప.'

ooo

సూర్యుడు అన్నాడు:
'చనిపోయీ చనిపోకుండా ఉండాలంటే
నీ అడుగుజాడలని వదిలి వెళ్ళు'

అగ్నిపర్వతం పేలింది
యాభై మైళ్ళు పారింది
అగ్ని ప్రవాహం

అక్కడి వాళ్ళెవరూ
ఇళ్ళొదిలి పోలేదు

అగ్ని ప్రవాహం ఆరి బూడిదయ్యాక
విత్తులు నాటగా
ఆరింతల అద్భుతమైన పంటలు

అగ్ని పర్వతం అన్నది:
'ఏ చెడులోనైనా
ఏదో మంచి దాగే ఉంటుంది.'

✦



గూఢచారి షో

గూఢచారి చిత్రాల్లో ఆకట్టుకునేవి వారు ఉపయోగించే వస్తువులే. లిప్‌స్టిక్ గన్‌లు, బటన్ కెమెరాలు, షూ లేసు సంకేతాలు వంటివెన్నో మనల్ని రెప్పవాల్చకుండా సీట్లకు అతుక్కుపోయేలా చేస్తాయి. సినిమాల్లో చూపించే వాటిలో చాలా వరకు నిజమైన గూఢచారులు వాడి వదిలేసినవే. సినిమాల్లో వాటికన్నా ఆశ్చర్యం కలిగించే పరికరాలెన్నో వారి దగ్గర ఉంటాయి. ప్రస్తుతం వాడుతున్న వాటి గురించి ఎవరికీ తెలీనివ్వరు కానీ, అప్పటికే తెలిసిపోయిన వస్తువులతో ఓ అంతర్జాతీయ స్పై మ్యూజియం నడుస్తోంది.

అమెరికాలోని వాషింగ్టన్ డీసీలోని 1875 నాటి లె డ్రాయిట్ బిల్డింగ్‌లో 2002 నుంచి ప్రారంభమైంది. దీన్ని త్వరలో మౌంట్ వెర్నన్ స్క్వేర్‌లోని కార్నెగీ లైబ్రరీ బిల్డింగ్‌లో మరింత భారీగా ఏర్పాటు చేయనున్నారు. కొరియా యుద్ధ సమయంలో కోడ్ బ్రేకర్‌గా పనిచేసిన మిల్టన్ మాల్ట్జ్ దీనికి తెరదీశాడు. ఆయనకు 1996లోనే ఈ మ్యూజియం ఏర్పాటు చేయాలని ఆలోచన వచ్చింది. దీనిలో 750 నిఘా, గూఢచర్య పరికరాల్ని ప్రదర్శనకు ఉంచారు. సైఫర్ మెషీన్లు, మినీ కెమెరాలు, రహస్య పరికరాలు, రేడియో ట్రాన్స్‌మిట్టర్లు, రిసీవర్లు, డెడ్ డ్రాప్స్‌తో పాటు కొన్ని ఆయుధాల్ని కూడా ప్రదర్శనకు ఉంచారు. వీటితో పాటు జేమ్స్‌బాండ్ సినిమాల్లో వాడిన గోల్డెన్ గన్, ఆస్టన్ మార్టిన్ డీబీ5 నకళ్లను కూడా చూడొచ్చు. మాతా హరి, జార్జ్ వాషింగ్టన్, జాన్ వాకర్‌ల ఘటనలకు సంబంధించిన డాక్యుమెంట్లతో పాటు చారిత్రాత్మక ఛాయాచిత్రాలు, ఇంటరాక్టివ్ డిస్ప్లేలు, చలన చిత్రాలు, వీడియోలు కూడా తిలకించొచ్చు. గ్రీకులు, రోమన్ల కాలానికి చెందిన నిఘా వస్తువులు కూడా ఉన్నాయి. బ్రిటీష్ రాజ్య విస్తరణకు కీలకంగా పనిచేసిన వేగుల పరికరాలు, వర్తమానాలు, సందేశాలు పంపే వస్తువులు, సంకేత భాషకు సంబంధించిన సమాచారాన్ని క్యురేటర్లు చాలా ఆసక్తిగా చెబుతారు. గూఢచర్యం ఉచ్ఛ దశకు చేరిన ప్రపంచ యుద్ధ, ప్రచ్ఛన్న యుద్ధం నాటి వస్తువులతో పాటు నిన్న మొన్నటి ఇరాక్ యుద్ధం సమయంలో అమెరికా ఉపయోగించిన నిఘా పరికరాలు ఆసక్తి పెంచుతాయి. సందర్శకులకు ఓ కవర్ ఐడెంటిటీనిచ్చి ఓ మిషన్‌ను అప్పజెబుతారు. గూఢచారి ప్రపంచం ఎలా ఉంటుందో అలా ఓ రూంలో బ్రీఫింగ్ ఇస్తారు. వారి ప్రపంచంలో నియామకాలు ఎలా జరుగుతాయి, శిక్షణ ఎలా ఉంటుంది, వారి ఆపరేషన్స్ ఏ విధంగా ఉంటాయి, ఆ సమయంలో వారికి కావాల్సిన నైపుణ్యాలు, పరికరాలు వంటి ఎన్నో విషయాల్ని వివరించే స్కూల్ ఫర్ స్పైస్ అనే విభాగం కూడా ఆసక్తికరంగా అనిపిస్తుంది. నిజ జీవితపు గూఢచారుల్లో రిటైర్ అయిన వారు, కవర్ బ్రేక్ అయిన వారు, పట్టుబడిన వారి ఫొటోలు, ప్రాజెక్ట్‌లు, వివరాలు కూడా వీలైతే తెలుసుకోవచ్చు.

గుట్టుకు కొన్ని..

లిప్‌స్టిక్ పిస్టల్

రష్యాకు చెందిన కేజీబీ ఆపరేటివ్స్ ఉపయోగించిన ఈ ఆయుధం ప్రచ్ఛన్న యుద్ధ కాలం నాటిది. 4.5 మిల్లీ మీటర్ల బుల్లెట్‌ను వదిలే ఇది సింగిల్ షాట్ ఆయుధం. కిస్ ఆఫ్ డెత్‌కు ఓ ఉదాహరణ.



రహస్య కాయిన్లు

కేజీబీనే వాడిన ఈ కాయిన్లలో నిఘా సమాచారాన్ని నిక్షిప్తం చేసిన మైక్రోఫిల్మ్‌లు, మైక్రోడాట్లను భద్రపరచొచ్చు. కాయిన్‌కు ఉన్న చిన్న రంధ్రంలో సూది గుచ్చి దీన్ని తెరిచేవారు. వీటిని 1990 వరకు వాడారు.



పావురం కెమెరా

తొలి ప్రపంచ యుద్ధ సమయంలో పావురాలకు చిన్న కెమెరాలను కట్టి శత్రువుల ఆనుపానులు రికార్డు చేసేందుకు వాడేవారు. శత్రువుల వద్దనున్న ఆయుధాలు, భద్రతా వ్యవస్థల తీరు తెలుసుకుని వ్యూహాలు మార్చేవారు. మ్యాపులు రూపొందించేందుకు కూడా ఇవి కీలకంగా ఉపయోగపడ్డాయి.

సైనైడ్ కళ్లద్దాలు

1975-77 మధ్య అమెరికాకు చెందిన సీఐఏ ఈ విషపూరిత కళ్లద్దాలను వాడింది. ఈ కళ్లద్దాల్లో సైనైడ్ పిల్లెట్‌ను అమర్చేవారు. పట్టుబడిన గూఢచారుల నుంచి రహస్యాలు తెలుసుకుంటానికి శత్రువులు విపరీతంగా టార్చర్ చేస్తారు. విషయం వచ్చాక చంపేస్తారు. దాని నుంచి తప్పించుకునేందుకు, రహస్యం పొక్కకుండా కళ్లద్దాల కొసల్ని నోటికి కరుచుకుని ప్రాణాల్ని విడిచేవారు.



లైటర్ కెమెరా

70ల తొలినాళ్లలో సీఐఏ దీన్ని బాగా ఉపయోగించుకుంది. ఇదే కాదు ఇలా రోజువారి ఎన్నో వస్తువుల రూపంలో కెమెరాల్ని అది తయారుచేసింది.



మినాక్స్

దాదాపు యాభై ఏళ్లపాటు స్పై కెమెరాగా మినాక్స్‌ను వినియోగించారు. అమెరికా నేవీలో పనిచేసిన జాన్ వాకర్ అనే కేజీబీ గూఢచారి 1970లో దీని ద్వారానే అమెరికా మిలటరీ రహస్యాలను చిత్రించాడు. ఇప్పటికీ దీన్ని తయారుచేస్తున్నారు.

మోస్ట్ వాంటెడ్ పేకలు

ఇరాక్ యుద్ధ సమయంలో ఉగ్రవాదుల్లో మోస్ట్‌వాంటెడ్‌లను తేలిగ్గా గుర్తుపట్టేందుకు అమెరికా ఈ పేకముక్కల్ని విడుదల చేసింది. కాలక్షేపానికి పేక ఆడుతున్న సమయంలో వారి చిత్రాలు తేలిగ్గా సైనికులు బుర్రకు ఎక్కించుకున్నారు.



007 గన్

జేమ్స్‌బాండ్ సిరీస్‌లోని గోల్డ్ ఫింగర్ చిత్రంలోని కథా వస్తువైన గన్‌కి నకలు ఇది.

ఎనిగ్మా మెషీన్

రెండో ప్రపంచ యుద్ధంలో రహస్య సందేశాల్ని అందించేందుకు నాజీలు వాడిన ఈ పరికరం వారి ఆయువుపట్టు. కోట్ల కాంబినేషన్లను ఇట్టే చేసే ఈ మెషీన్ కోడ్‌ను బ్రేక్ చేయడం అసాధ్యం. ఓ చిన్న బ్రీఫ్‌కేసులా మార్చి ప్రపంచవ్యాప్తంగా గూఢచారులకు అందించింది నాజీ సైన్యం. దీని గుట్టు విప్పేందుకు బ్రిటిష్ నిఘా వ్యవస్థ గణితవేత్తలు, భాషావేత్తలు, కళాకారులు, మేధావులు తదితరులను ఒక జట్టుగా చేసి బ్లెట్చ్‌లీ పార్క్‌లోని ఓ రహస్య స్థావరంలో కార్యక్రమాలు రూపొందించింది. ప్రఖ్యాత కంప్యూటింగ్ శాస్త్రవేత్త అలన్ ట్యూరింగ్ నేతృత్వంలో సాగిన పరిశోధనల్లో బొంబా, కలొసల్ అనే మరో వ్యవస్థను రూపుదిద్ది ఎట్టకేలకు ఎనిగ్మా కోడ్‌ను బద్దలుగొట్టగలిగారు. ఈ విషయాన్ని యుద్ధానంతరం దాదాపు 30 ఏళ్లపాటు రహస్యంగానే ఉంచారు.

బాండ్ కార్

జేమ్స్‌బాండ్ సినిమా గోల్డ్‌ఫింగర్ (1964)లో బాండ్ వాడే కారు ఆస్టన్ మార్టిన్ డీబీ5కు ఇది నకలు. మెషీన్ గన్‌లు, టైర్ స్లాషర్లు, బుల్లెట్ ప్రూఫ్ షీల్డ్, ఆయిల్ జెట్‌లు, డాష్‌బోర్డ్ రాడార్ స్క్రీన్, రొటేటింగ్ లైసెన్స్ ప్లేట్, ఎజెక్టర్ సీటు వంటి అన్ని హంగులతో కూడిన ఈ కారు అప్పట్లో సంచలనం.



ఆయన అతినిరాడంబరంగా ఉంటారు. మేధావి.. సమయ స్ఫూర్తితో జోకులేస్తాడు అవి బాకుల్లా గుచ్చుకుంటాయి. ఆయన ఇల్లు రాజా టి.నగర్ (చెన్నై) పాండీ బజార్ పక్క సందు. ఒక భువన విజయాన్ని తలపించేది. ఔత్సాహిక కళాకారులు, రచయితలు అక్కడే మకాం. కథా చర్చలు, వాద ప్రతివాదాలు జరుగుతుండేవి. అందరూ సహ పంక్తిలో భోజనాలు చెయ్యడం నిత్యం కనిపిస్తుండేది. షూటింగులు లేని సమయంలో గ్లాస్కో లుంగీ, జుబ్బాలో మల్లెపువ్వులాంటి మనసున్న మనిషి పేరు ప్రభాకర్ రెడ్డి.

కథల డాక్టరు

తెలంగాణ నల్గొండ జిల్లా తుంగతుర్తి గ్రామంలో లక్ష్మారెడ్డి, కౌసల్యమ్మ దంపతులకు 1935 వ సంవత్సరాన జన్మించాడు. తుంగతుర్తిలోనే ప్రాథమిక విద్యను అభ్యసించాడు. హైస్కూలు చదువులు సూర్యాపేటలో కొనసాగించాడు. తర్వాత భాగ్యనగరం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి 1955-60లో బి.యస్. ఉత్తీర్ణుడైయ్యాడు. భాగ్యనగరంలో ఉన్నప్పుడే సాంస్కృతిక కార్యక్రమాలపై దృష్టి మళ్ళింది. కను ముక్కు తీరు, దేహదారుఢ్యం బావుండటంతో అందరూ సినిమాల్లో నటించమని ప్రోత్సహించారు.

చివరకు మిగిలేదితో..

ఈ సినిమాలోని సైక్రియాటిస్ట్ పాత్రకి ప్రభాకర రెడ్డి అయితే బాగుంటుందని నిర్మాతలు ఎంపిక చేశారు. నిర్మాతల్లో ఒకరైన యం.సత్యనారాయణ తెలంగాణ వాసి. మరో నిర్మాత గుత్తా రామినీడు ఔత్సాహిక కళాకారుల్ని ప్రోత్సాహించే మనస్తత్వం కలవాడు. ఆ సినిమాకి లాభాల పంట పండక పోయినా అవార్డుల పంట పండింది. ఇదే సమయంలో కమలాకర కామేశ్వరరావు దృష్టి ప్రభాకర్ రెడ్డి మీద పడింది. పాండవ వనవాసం చిత్రం (1962)లో కర్ణ పాత్రకి ఎంపిక చేశారు. ఈ చిత్రం చూసిన బి.ఎ. సుబ్బారావు భీష్మ చిత్రంలో శంతనుడి పాత్రకి ఎంపిక చేశారు. సుజాత అనే కొత్త అమ్మాయిని సత్యవతి పాత్రకి ఎంపిక చేసి అందమైన హంస వాహనం చేయించి చిత్రీకరించారు. భీష్మ చిత్రం చూసిన వారందరికీ 'హైలో.. హైలెస్సో.. హంస కదా నా పడవ' అనే పాట గుర్తుండిపోతుంది. శంతనుడు-సత్యవతిలా జంట చాలా అందంగా కనిపిస్తారు. మళ్ళా కమలాకరుడే మహామంత్రి తిమ్మరుసు చిత్రంలో గజపతి పాత్రకి తీసుకున్నారు. ఇక వరసగా విజయవంతమైన చిత్రాల పరంపర మొదలైంది. నర్తనశాల, క్రిష్ణార్జున యుద్ధం, బొబ్బిలి యుద్ధం వంటి చిత్రాల్లో నటించడం ద్వారా ఇక వెనుదిరిగి చూసుకోవలసిన అవసరమే లేకపోయింది. అలా 472 చిత్రాలు విజయవంతంగా పూర్తి చెయ్యగలిగారు.

మానవ సంబంధాలే రచనలు

ప్రభాకర్‌రెడ్డి నటుడిగా నటనపై ఎంత ఆసక్తి చూపించేవాడో రచయితగా సినిమా కథల రచనపై అంతే శ్రద్ధ చూపించేవాడు. మొత్తం 21 సినిమాలకు కథలు అందించగలిగాడు. ఒక పక్క నటుడిగా బిజీగా వుంటూ కథల పట్ల ఎంత శ్రద్ధ చూపించేవాడో అర్థం చేసుకోవచ్చు. ఆయన అందించిన కథల్లో ప్రముఖంగా పండంటి కాపు రం, పచ్చని సంసారం, ధర్మాత్ముడు, గృహ ప్రవేశం, గాంధీ పుట్టిన దేశం, కార్తీక దీపం, నాకు స్వాతం త్ర్యం వచ్చింది చిత్రాల్ని గమనిస్తే మరుగున పడుతున్న మానవ సంబంధాలకు పెద్ద పీట వేసిన వ్యక్తిగా ప్రభాకర్ రెడ్డిని చెప్పుకోవచ్చు. జీవన మాధుర్యం వెలికి తెచ్చి ప్రేక్షకుల కళ్ళు చెమర్చే సన్నివేశాల రూపకల్పన చేసేవాడు. జయప్రద అని నామకరణం చేసి 'భూమి కోసం' చిత్రంలో మూడు నిమిషాల పాటకి లలితారాణిని పరిచయం చేశాడు. అలాగే రవికాంత్ అనే విలన్‌ని పరిచయం చేశాడు. అదే విధంగా సమస్యల వలయంలో చిక్కుకున్న లక్ష్మీ దీపక్‌కి చిత్రాలనిచ్చి నిలబెట్టాడు. గణేశ్ పాత్రతో 'నాకూ స్వాతంత్రం వచ్చింది' చిత్రం ద్వారా తెలుగు తెరకి పరిచయం చేసింది ప్రభాకర్ రెడ్డిగారే. ఆస్థాన కవిలా ఉండేవాడు. బెంగాలీ బాబులా బోసి నవ్వుతో భలే తమాషాగా కనిపిం చేవాడు. ప్రభాకర రెడ్డి సూరి మధ్య సంభాషణ చాలా గమ్మత్తుగా సాగేది. చిలికి చిలికి గాలివాన అయ్యేది. ఆఖరిలో అమృతం కురిసేది. ఆ అమృతమయమైన చిత్రాలే పైనుదహరించిన చిత్రాలు.

లోపలి మనిషి

ప్రభాకర్ రెడ్డి లోపలి మనిషి చాలా తక్కువ మందికి తెలుసు. తన ఆఫీసుకి ముందే గీత కేఫ్ (పాండీ బజారు) ఇడ్లీ, వడ, పొంగల్ తప్పనిసరిగా ఉండాల్సిందే. కమ్మని కాఫీ సేవించిన తరువాత కుశల ప్రశ్నల పరంపర కొనసాగేది. ఇల్లు ఎలా గడుస్తుంది? ఏవైనా ఇబ్బందులున్నాయా? పిల్లల చదువులు ఎలా సాగుతున్నాయి? కథా చర్చలో కూర్చున్న వారికి వారి సొంత సమస్యలు కళ్లముందు కనిపిస్తే 'క్రియేటివిటి' ఏం బైటికొస్తుంది? అని భావించేవారు. ఆహార వ్యవహారంపై మొహమాట పడవద్దని చెప్పేవారు. ఏ కథా వస్తువునైనా సన్నివేశాన్నైనా ప్రాక్టికల్‌గా ఆలోచించేవారు. కథ పూర్తయిన తరువాత ఆ కథని చీల్చి చెండాడేవారు. ఈ కథను ప్రేక్షకులు ఎందుకు ఆదరించాలి? మిగితా సినిమాల్లో లేనిదీ మన సినిమాల్లో ఏముంది? ఇలా ప్రశ్నల వర్షం కురిపించేవారు. ఆయనలో ఉన్న గొప్ప గుణం ఒకటి 'మీరు నన్ను కన్విన్స్ చెయ్యండి లేదా నేను మిమ్మల్ని కన్విన్స్ చేస్తాను. అంతేగాని కాంప్రమైజ్ కథలు తయారు చెయ్యొద్దు. మనం కాంప్రమైజ్ అయినా ప్రేక్షకులు కారు." అనేవారు. అందుకే అన్ని విజయవంతమైన చిత్రాలే చేయగలిగారు. కథా చర్చలల్లో మిత్రుడు లక్ష్మీ దీపక్‌తో పాల్గొనడం నా అదృష్టం!

ఆణిముత్యాలు

పల్నాటి యుద్ధం చిత్రంలో బ్రహ్మన్నాయుడు అనుచరుడు కన్నమదాసు పాత్రలో జీవించాడు. 'బ్రహ్మచారి' చిత్రంలో ఎ.ఎన్.ఆర్. సోదరుడిగా, 'ఉమ్మడి కుటుంబం'లో ఎన్టీఆర్ సోదరుడిగా, 'శ్రీకృష్ణావతారం'లో బలరాముడిగా, 'రామాలయం'లో రాముడి పాత్రలో, పండంటి కాపురం చిత్రంలో కృష్ణ సోదరుడిగా, 'మోసగాళ్ళకు మోసగాడు'లో ఓ కౌబాయి వేషంలో, 'అల్లూరి సీతారామరాజు'లో మల్లు దొరగా, భూమికోసం, ఎదురు లేని మనిషి, రామరాజ్యం, రక్తపాతం, దానవీర శూరకర్ణ, ఇంద్ర ధనుస్సు, యమగోల,

గోరింటాకు, ప్రేమాభిషేకం ఇవి మచ్చుకి మాత్రమే. మనసుకి నచ్చిన పాత్రలను పోషించేవాడు, జీవించేవాడు.



అవార్డులు, రివార్డులు

పండంటి కాపురం చిత్రంకు బెస్ట్ ఫీచర్ ఫిలిం నేషనల్ అవార్డు, పచ్చని సంసారం, ధర్మాత్ముడు, గృహ ప్రవేశం, నాకూ స్వాతంత్రం వచ్చింది చిత్రాలకు ఉత్తమ అవార్డులు వచ్చాయి. యువతరం కదిలింది, పల్లె పిలిచింది, చిన్న కోడలు చిత్రాల్లో ఉత్తమ నటుడిగా అవార్డులు కైవసం చేసుకున్నారు. గృహ ప్రవేశం, గాంధీ పుట్టిన దేశం చిత్రాలకు ఉత్తమ కథారచయితగా అవార్డులు అందుకున్నాడు.

చివరి రోజుల్లో నిర్లిప్తత

1997 అప్పటికే చెన్నై నుండి ఇండస్ట్రీ భాగ్యనగరానికి తరలి వెళ్లడం, సినిమా బడ్జెట్ అందుబాటులో లేకపోవడం, నిర్మాణమనేది ఒక అందని ద్రాక్షగా మిగిలిపోవడం, యూనిట్ సభ్యుల్లో ఆర్థికపరమైన అంశాలు ఆకాశాన్ని అంటడం. భువన విజయంలా ఔత్సాహిక కళాకారులతో కళకళలాడే ఆయన ఇల్లు బోసిపోయింది. సంగీత దర్శకులు ఆఫీసుకి రావడం మానేసి స్టూడియోల్లో డైరెక్టుగా రికార్డింగ్స్ చేయడం, నటీనటుల పారితోషకాలు పెరిగిపోవడం, నటీనటులు, సాంకేతిక నిపుణులు అందుబాటులో లేకపోవడం ఇవన్నీ ప్రధాన కారణాలయ్యాయి.

నిర్మాతని బతకనివ్వాలి

ప్రభాకర్ రెడ్డి తరచూ అనే మాట 'నిర్మాత అనేవాడు పాడి ఆవు పచ్చగా బతకనివ్వండి. అందరూ బతకండి! నిర్మాత పది సినిమాలు తీస్తే వంద మందికి పది కాలాలు ఉపాధి దొరుకుతుంది. అటువంటి నిర్మాతని బలిపశువు చెయ్యకండి. సినిమా నిర్మాణమనేది ఓ వ్యామోహం. అది లేకుండా నిర్మాత బతకలేడు. నటీనటులు ఎక్కడైనా పనిచేయగలరు. నిర్మాత మరొకరి దగ్గర పనిచెయ్యలేడు. పదిమందికి పని కల్పించే వాడికి పనిలేకపోతే ఆ నిర్మాత పని అయిపోయినట్టే..' అనేవాడు. ప్రభాకర్‌రెడ్డిగారి మాటలు అక్షర సత్యాలు. అందరి బాగు ఆలోచించే ఆయన 1997లో తనువు చాలించాడు.

జయప్రదతో..

- ఇమంది రామారావు

9010133844

బుద్ధి చెప్పడానికే...

వార్‌విక్‌షైర్‌కు చెందిన 45 ఏళ్ల లారా ఆర్నాల్డ్స్‌కు ఒక షాకిచ్చే వార్త తెలిసింది. బిజినెస్ పనిపై అంటూ న్యూయార్క్‌కు చెక్కేసిన భర్త వెళ్లింది తన ప్రియురాలి దగ్గరికి అని తెలుసుకుని హవ్వా అనుకుంది. అసలీ సంగతి తనకెలా తెలిసిందంటే... ప్రయాణపు హడావిడిలో భర్త ఫోన్ ఇంటిలోనే మర్చిపోయి వెళ్లిపోయాడు. అందులో వారిద్దరూ చేసుకున్న మెసేజ్‌లు చూసిన లారా భర్తకు బుద్ధి చెప్పాలనుకుంది. 15 రోజుల ట్రిప్ అని వెళ్లిన భర్త వచ్చేలోగా వారుంటున్న ఇంటిని అమ్మేసి అతడిని రోడ్డున నిలబెట్టాలని నిర్ణయిం చుకుంది. అనుకున్నదే తడవుగా అమ్మేసింది, తన సామానంతా కొత్త ఇంటికి సర్దేసింది. జాలీగా తిరిగొచ్చిన భర్త తలుపు తడితే ఆ ఇంటిని కొన్న విద్యార్థులు ఎవడ్రా వీడు అన్నట్టు చూసి ఓస్ నువ్వేనా లారా భర్తవి. నీ సామాను వంట గదిలో ఉంది వెంటనే తీసుకెళ్లనే సరికి అతడికేం పాలుపోలేదు. నిదానంగా విషయం తెలిశాక ఏం చేస్తాడు ఆ రాత్రికి ఎక్కడో తలదాచుకుని తనుండుందేకు అద్దె ఇల్లు వెతుక్కుంటున్నాడు.

చెత్త పడకుండా...



మిచిగాన్ విశ్వవిద్యాలయంలో చదువుతున్న మన విద్యార్థి దర్శన్ కరావత్ ఓ రేడియో షో విన్నాడు. తమ వాడకం ద్వారా చెత్త పోగవడాన్ని వీలైనంత తక్కువగా ఉండేలా చూసిన ఓ జంట గురించి తెలుసుకున్నాడు. తాను కూడా వారిలా తన వల్ల ఎక్కువ చెత్త పోగవకుండా చూడాలని నిర్ణయిం చుకున్నాడు. అలా ఏడాది పాటు చెత్త పస్తులు ఉన్నాడు. ప్లాస్టిక్ సంచులు, ప్యాకేజీ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్ నిషేధం పెట్టుకున్నాడు. సరుకులన్నీ బుట్టలో తెచ్చుకోవడం, ఎక్కడికెళ్లినా వెంట ప్లేటు, గ్లాసు, చెంచా తీసుకెళ్లడం ఇలా ఎన్నో ప్రయోగాలు చేసి ఏడాదిలో ఒక అమెరికన్ పోగుచేసే చెత్తలో కేవలం 0.2 శాతం చెత్తే ఎత్తాడు. అదంతా రెండు సంచులకు సరిపోతుంది. ఆ తర్వాత మరో ఏడాదిన్నర ఇలా ఉండగలిగాడు కానీ, అప్పటివరకు ఉన్న ఆన్ ఆర్బర్ నుంచి న్యూయార్క్‌కు మారిపోయే సరికి నెల తిరక్కుండానే డస్ట్ బిన్నులు నిండిపోయాయి.

వింత లోకం

జాకిస్తాన్ అని దేశమట

అమెరికాలోని ఉటా ఎడారిలో ఓ రెండు ఎకరాల భూభాగంలో జెండా పాతేసి అది తన దేశమే అంటాడు జాక్ ల్యాండ్స్‌బెర్గ్. అదే అంటూ బోర్డు తగిలించేశాడు. అందులో అనుమతికి పాస్‌పోర్ట్‌లు గట్రా తయారుచేసి స్నేహితులకు అందించాడు. గాళ్‌ఫ్రెండ్ పౌరసత్వంపై ఓ నిర్ణయానికి వస్తున్నాడు. ఇదంతా ఏమిటంటే ఓ పొద్దుపోని కుర్రాడు ఏదో ఒకటి చేసి వార్తల్లో నిలవాలని అనుకున్నాడు. ఎపుడో ఈబే అనే వెబ్‌సైట్ ద్వారా కొన్న స్థలమే ఇది. దేశమంటే ఇదనే కచ్చితమైన అర్థం, చట్ట బద్ధత లేవని అనేస్తూ ఇలా తయారయ్యాడు. అతడి చేష్టలకు నవ్వేస్తున్నారు స్థానిక అధికారులు. చుక్క నీరు దొరకని ఆ ఎడారిలో ఇతడి గురించి ఇప్పుడే పెద్దగా పట్టించుకునే ఆలోచన లేదు ప్రభుత్వానికి. పైపెచ్చు జోక్‌లు కూడా వేస్తున్నారు ప్రభుత్వాధికారులు.



ఎండుటాకు 'చిత్రం'

పట్టుమని పదహారేళ్లు వుంటాయేమో. ఎంత చక్కటి సృజన వుందో ఆ లేత చేతిలో. ఎండుటాకులపై తను వేసిన చిత్రాలు చూసినవారి స్పందనలే అవి. పోలాండ్‌కు చెందిన జొవాన్నా విరాజ్కా గురించిన మాటలే అవన్నీ. అందరు ఆర్టిస్టుల్లా ఆమె కాగితాన్ని కాన్వాస్‌గా ఎంచుకోలేదు. చెట్ల నుంచి రాలిన ఆకుల్ని ఎంపిక చేసుకుంది. గత ఏడాది ... తన నేస్తాలంతా ... నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనడానికి సిద్ధమౌతుండగా...విరాజ్కా మాత్రం తను సేకరించిన ఎండుటాకులపై అక్రిలిక్ వాటర్ పెయింట్లతో బొమ్మలేయడంలో రాత్రంతా గడిపింది. నచ్చిన వాటిని తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో పోస్ట్ చేసింది. చెప్పలేనంత స్పందన లభించడంతో మరింత ఆసక్తిగా వేయసాగింది ఆకు చిత్రాలను.

తెలుసా

ఉబ్బెత్తు కుడ్యచిత్రాలు

కేరళ రాష్ట్రం తిరుచ్చూరు సమీపంలోని కాలడి శ్రీ శంకర విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని 1,200 అడుగుల పొడవైన గోడ అందమైన ఉబ్బెత్తు చిత్రాలతో అలంకరించబడి ఉన్నది. ఐదు అడుగుల ఎత్తుగల ఒక కుడ్య చిత్రంలో శిష్యుణ్ణి వరుసగా నాలుగు యుగాలు అంటే సత్, త్రేతా, ద్వాపర, కలి యుగాలకేసి నడిపిస్తూ జ్ఞానబోధ చేసే గురువు సాక్షాత్కరిస్తాడు. రామాయణం, మహాభారతం, శాకుంతలం, మేఘసందేశం, రఘువంశం మొదలైన గ్రంథాలలోని దృశ్యాలు చిత్రీకరించబడి ఉన్నాయి. భరతనాట్యంలోని 108 కరణాలు, ఆదిశంకరులు జీవితగాథ మొదలైనవి చూపరులను అలరిస్తాయి. మూడేళ్ళ శ్రమ ఫలితంగా ఇది 1998వ సంవత్సరంలో పూర్తయింది. ఈ అపూర్వ సృష్టి 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు చేసుకున్నది!

అతి పెద్ద నివాసగృహం

ఇప్పుడు జోధాపూర్‌గా పిలువబడే జోధాగఢ్ ఒకప్పుడు మేవార్ సంస్థానానికి రాజధానిగా ఉండేది. దానిని 1859వ సంవత్సరంలో రావ్‌జోధా నిర్మించారు. సూర్యరశ్మిని ప్రతిఫలింపజేసి, లోపలి భాగాలను చల్లగా ఉంచడానికి వీలుగా భవనాలన్నిటికీ లేత నీలం రంగు వేశారు. అందువల్ల దీనికి 'నీలం రంగు నగరం' అనే పేరు వచ్చింది. జోధ్‌పూర్‌లోని కోటలు, భవనాలు ఆనాటి ప్రాభవాన్ని, వారసత్వాన్ని చాటుతున్నాయి. ఇక్కడ సుప్రసిద్ధమైన ఉమేద్ భవన్ ఉంది. ప్రపంచంలోనే అతి పెద్ద వ్యక్తిగత నివాస గృహంగా దీనికి పేరుంది. ఇరవై ఆరు ఎకరాల స్థలంలో ఈ భవనం నిర్మించబడింది. పదిహేను ఉద్యానవనాలూ, మూడువందల నలభైయేడు బ్రహ్మాండమైన గదులూ ఈ భవనంలో ఉన్నాయి.



హుమాయున్ మసీదు



రెండవ మొఘల్ చక్రవర్తి హుమాయున్ మరణించినప్పుడు ఆయన భార్య హమీదా బాను బేగం, భర్త పేరుతో గొప్ప మసీదు నిర్మించాలని ఆశించింది. హీరత్ నుంచి సుప్రసిద్ధ భవన నిర్మాణ శిల్పకారులను రప్పించింది. తండ్రీ కొడుకులైన ఆ శిల్పకారులే భవన రూపాన్ని రూపొందించారు. 1562లో నిర్మాణం ప్రారంభమై, పూర్తికావడానికి ఎనిమిదేళ్ళు పట్టింది. నిర్మాణం విలక్షణంగా ఉండడానికి నలుపు, పసుపు రాళ్ళతోపాటు ఎరుపు సున్నపురాయిని కూడా ఉపయోగించారు. చతురస్రాకార ఉద్యానవనం చుట్టూ ఎత్తయిన గోడలు నిర్మించబడ్డాయి. ఉద్యానవనం మధ్య ఉన్నతమైన వేదిక మీద మసీదు చాలా గంభీరంగా కనిపిస్తుంది. రాగి గోపుర శిఖరంతో అందమైన చలవరాతి బురుజులు ఉన్నాయి. ఈ రకం మొఘల్ నిర్మాణ శిల్పకళలో ఇదే ప్రథమం. ఉత్తరోత్తరా తాజ్ మహల్ నిర్మాణానికి సైతం ఇదే ప్రేరణ కలిగించింది. మసీదుకు చుట్టూ ఉన్న ఉద్యానవనాన్ని 'చాల్ బాగ్' అంటారు. ఇది నాలుగు చతురస్రాలుగా ఎత్తయిన బాటలు, నీటి కాలువల చేత విడదీయబడి ఉన్నది. ఈ రకం ఉద్యానవన-మసీదు భారత ఉపఖండంలోనే ఇదే మొదటిది. ఈ భవన ప్రాంగణంలోనే హమీదా బాను బేగం మసీదు, మరి కొందరి పాలకుల మసీదులు ఉన్నాయి. 1993లో ఇది ప్రపంచ వారసత్వ స్థలంగా గుర్తించబడింది.

పట్టడక్కల్

కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా క్రీ.శ. 543-757 మధ్యకాలంలో రెండు శతాబ్దాల పాటు చాళుక్య సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉండేది. బాదామి రాజధానిగా పాలన సాగించారు. కొంత కాలం చాళుక్యులు ఆక్రమించారు. విక్రమాదిత్యుడు వారిని ఓడించాడు. నూతన రాజధాని పట్టడక్కల్ (మాణిక్య కిరీట నగరం) స్థాపన జరిగింది. చాళుక్యులు గొప్ప కళా పోషకులు. వారి ఆలయ నిర్మాణ కళ, బండలను తొలిచి నిర్మించే దశ నుంచి నిర్దిష్ట రూప నిర్మాణానికి పరిణతి చెందింది. రేశ, నాగర, ప్రాసాద, విమానశైలుల సమ్మేళనంతో ఆలయాలు నిర్మించబడ్డాయి. విమానశైలి దక్షిణాదికి చెందినది. ఇండో-ఆర్యన్ నాగరశైలి ఉత్తర భారతదేశానికి చెందినది. బాదామికి 22కి.మీ దూరంలోని పట్టడక్కల్‌లో పది ఆలయాల సముదాయం ఉన్నది. వాటిలో ఎక్కువ భాగం శివాలయాలే. వాటిలో రెండవ విక్రమాదిత్యుడి భార్య రాణి లోకమహాదేవి నిర్మించిన విరూపాక్ష మందిరం ప్రధానమైనది.



వెలుతురు చెట్లు

బి. సాంబశివరావు

◆ కథ

దుమ్ము రేపుకుంటూ వేగంగా వచ్చిన ఓ కారు హఠాత్తుగా ఆ యింటి ముందు ఆగింది. డోర్లు తెరుచుకున్నాయి. చేతిలో తుపాకులతో ముగ్గురు వ్యక్తులు బయటకు వచ్చారు. తుపాకులు సవరించుకుంటూ చుట్టూ కలియచూస్తున్నారు.

ఈ శ్రీలంక వాసులు ముగ్గురూ చూడ్డానికి ఒకే వయసులో ఉంటారు. ఒకే పనికోసం తుపాకీ పట్టుకున్న వాళ్లలా వున్నారు. ఆ రోజు శనివారం, 1930వ సంవత్సరం.

వాళ్లు ఈనాటి శ్రీలంక తమిళ టైగర్లు కారు. వాళ్లు బందిపోటు దొంగలు అంతకంటే కారు. వాళ్లు కేవలం టీచర్లు. చిన్న గడ్డం, తలపై చిన్న టోపీ, కళ్లకి అద్దాలు ధరించి సన్నగా వున్న ఆ వ్యక్తి డాక్టర్ కోవూర్. మిగిలిన ఇద్దరూ శామ్యూల్ జాకబ్, యస్.ఎ.మాన్ ముగ్గురూ జాఫ్నా సెంట్రల్ కాలేజీల్లో టీచర్లే.

అప్పుడప్పుడూ ముగ్గురూ కలిసి వేటకు వెళుతుంటారు. అందుకోసమే ఈసారి 'ఒడ్డు చుట్టాన్' అడవిలోకి వేటకై వచ్చి 'మాంకులం' గెస్టు హౌసు ముందాగారు.

ఇలా వచ్చేవాళ్లకు మార్గదర్శకులుగా ఆ అడవిలో చాలా మంది ఉన్నారు. వారిలో ఒకడు చిన్నయ్య. చిన్నయ్య కూడా ఓ చిన్నపాటి వేటగాడే. ఆ అడవిలో ఏ అంగుళంలో ఏముందో చిన్నయ్యకి తెలుసు. అందుకే చిన్నయ్యను తమ మార్గదర్శిగా కుదుర్చుకున్నారు ఈ వేటగాళ్లు.

చిన్నయ్య ఆ అడవికి సంబంధించిన పటాన్ని టేబిల్ మీద పరిచాడు. ఎక్కడ ఏముందో చెబుతున్నాడు. ముగ్గురూ అంతా వింటున్నారు. 'ఒలుమాడు' అనే ప్రాంతం వారికి నచ్చింది. అక్కడే ఆ రాత్రికి వేటాడాలనే నిశ్చయానికి వచ్చారు. చిన్నయ్యతో అదే చెప్పారు.

"వద్దు సార్! మనం అక్కడికి వెళ్లొద్దు" భయపడుతున్నట్టు చెప్పాడు చిన్నయ్య.

"ఏం? అక్కడ జంతువుల్లేవా? కానీ ఎవరూ అక్కడి కెళ్లి వేటాడలేరు."

"కారణం ?" ప్రశ్నించాడు మాన్.

" ఆ ప్రాంతం అంతా కాదేరి దయ్యాల కాపలాలో వుంది సార్!".

ముగ్గురూ ఆశ్చర్యపోతూ ఒకర్నొకరు చూసుకొన్నారు.

"చిన్నయ్యా! కాదేరి దయ్యమేమిటి?" ఈసారి కోవూర్ చిన్నయ్య వైపు చూస్తు అడిగాడు.

ప్రాణాలతో తిరిగి రాలేరు. ఓసారి ఏమియిందంటే.." చిన్నయ్య కావాలనే ఆపాడు.

"ఆ ఏమయింది? చెప్పు." జాకబ్ ఆసక్తిగా అడిగాడు.

"ఇది ఆరేళ్లనాటి సంగతి. మీలాగే నలుగురు మనుషులు వేటాడ్డానికి వచ్చారు సార్! ఈ 'ఒలుమాడు' దగ్గరికి వెళ్లారు. అక్కడే ఓ నీటిగుంట ఉంది. అక్కడికి ఎందుకెళ్లారో తెలియదు గానీ, మర్నాడు ఉదయం అటు వెళ్లినవారికి నలుగురూ శవాలై కన్పించారు. తుపాకులు కూడా వాళ్ల పక్కనే ఉన్నాయి. నాలాంటోణ్ణి కలిస్తే అక్కడికి వెళ్లవద్దని చెప్పేవాళ్లు. వాళ్లు అలా కలవకుండా వెళ్లారు. ఆ 'కాదేరి'కి బలయ్యారు.

"చిన్నయ్యా! కాదేరి ఎక్కడ వుంది? ఎలా వుంటుంది? నువ్వెప్పుడయినా చూశావా?" మాన్ ప్రశ్నల పరంపర కురిపించాడు.

"చూడకపోవటమేంటి సార్! దాని గురించి



నాకు బాగా తెలుసు. ఆ దయ్యానిది చాలా పెద్ద కుటుంబం సార్! ఇంతకీ అవి ఎలా వుంటాయో మీకు చెప్పలేదుగా. చెట్ల రూపంలో వుంటాయి. రెండు పెద్దవి. వాటి పక్కనే చిన్నవీ ఉంటాయి. పెద్దవి రెండూ తల్లిదండ్రులంట. పక్కనున్నవి వాటి పిల్లలంట. ఎవరో బాగా మంత్రాలొచ్చినోళ్లు మాత్రమే వాటి దగ్గరదాక వెళ్లి చూడగలరు గానీ అందరివల్లా కాదు. పగలంతా ఈ దయ్యాలు, జంతువులై తిరుగుతాయట. చీకటి పడేసరికి మళ్లీ 'పాల్' చెట్ల రూపానికి మారతాయంట. ఎవరైనా తుపాకీతో కాల్చారా, వాళ్లకే భూమ్మీద నూకలుండవ్. మరో సంగతి సార్! అడికి పోతే రాత్రీ పగలులాగే వుంటుంది. ఆ దయ్యాల నుంచి అంత వెలుగు వస్తుంది సార్."

చిన్నయ్య చెప్పేదంతా వింటూ జాకబ్, మాన్‌లు భయపడసాగారు. కోవూర్ మాత్రం చిన్నయ్య చెప్పిన దాన్ని నిర్భయంగా విశ్లేషిస్తున్నాడు.

"కోవూర్! మనకిక్కడ వేటా వద్దు. ఆటా వద్దు. వేరే చోటుకి పోదాం" అన్నాడు జాకబ్.

కోవూర్ చిన్నగా నవ్వుతూ "జాకబ్! చిన్నయ్య చెప్పినదానికే అంతగా భయపడి వేట మానుకోవటమెందుకు? చిన్నయ్యా! ఈ రాత్రికి మనం 'ఒలుమాడు' ప్రాంతానికి వెళుతున్నాం. భోజనాలు త్వరగా సిద్ధం చేయించు."

"వద్దు సార్! వద్దు. మీలాంటోళ్లకి నేను చెప్పదగినోణ్ని కాకపోయినా నా మాట వినండి" చిన్నయ్య అన్నాడు.

వేటాడకపోయినా, కనీసం ఆ ప్రాంతాన్నయినా చూడాలని డాక్టర్ కోవూర్ అభిలాష. అదే అన్నాడు చిన్నయ్యతో. తుపాకీలు చేతిలో లేకుండా అయితే ఈ ప్రాంతానికి వెళ్లటానికి చిన్నయ్య అంగీకరించాడు.

జాకబ్, మాన్‌లు మాత్రం లోలోపల భయపడుతూనే వున్నారు.

భోజనాలు చేసి మాత్రం 9 గంటలకు కారులో తమ సరంజామాతో బయల్దేరారు. నలుగురూ అరగంట ప్రయాణం తర్వాత ఓ వంతెన దగ్గర కారాపారు. అందరూ దిగారు.

జేబులో పసుపు కొమ్ములు, దారం తీసాడు చిన్నయ్య. దారానికి పసుపు కొమ్ములు కట్టి 'రాఖీలు'గా అందరికీ కట్టసాగాడు.

"ఇవెందుకు? " అన్నాడు కోవూర్

"ఇవి రక్షాబంధనాలు సార్! ఇవి కట్టుకుంటే దయ్యాలు దగ్గరికి రావని మా నమ్మకం". అతనితో ఆ వేళలో పేచీపడి వాదించదలచుకోలేదు కోవూర్. చిన్నయ్య తన తలపై సెర్చ్ లైట్ ధరించాడు (గనుల్లో పనివారు, రాత్రి వేటకు వెళ్లేవారు ఇలాంటివి ధరిస్తారు). ముందుగా నడుస్తూ త్రోవ చూపిస్తున్నాడు. గజిబిజిగా అల్లుకొన్న తీగల్ని చీల్చుకుంటూ, గుబురుగా వున్న లీచ్ మొక్కల్ని విడదీస్తూ నడుస్తున్నారు. ఆ చీకటిలో కీచురాళ్ల రొదలు, వివిధ పక్షులు, జంతువుల అరుపులు కొత్తవాళ్లకు చాలా భయంకరంగా ఉంటాయి.

చిన్నయ్య హఠాత్తుగా అందర్నీ ఆపాడు. తన చూపుడువేలుపై చూడమన్నాడు.

కోవూర్‌తో పాటు అందరూ చూసారు.

ఓహ్! ఎంత అద్భుతం! అటువంటి దృశ్యాన్ని వాళ్లెవరూ అంతకుముందు చూసి ఎరుగరు. కోవూర్ ఫీల్డ్ గ్లాస్ కళ్లకు పెట్టి చూశాడు. అత్యద్భుతమైన ఆ కాంతి ఎక్కడి నుండి వస్తుంది? పరిశీలనగా చూశాడు. అక్కడ దాదాపు 30 చెట్లదాకా వున్నాయి. వాటి కొమ్మలన్నీ నిప్పుకణికల్లా మెరుస్తున్నాయి. వాటిల్లో రెండు చెట్లు మాత్రం చాలా పొడవుగా వున్నాయి.

"చిన్నయ్యా! ఆ పొడవుగా వున్న చెట్లేనా కాదేరీ దయ్యాలు?"

"అవున్సార్! పక్కనున్న చిన్న చెట్లన్నీ వాటి పిల్లలు సార్!"

కోవూర్‌కి ఇంకా ముందుకు వెళ్లాలనిపించింది. చిన్నయ్యే కాదు, జాకబ్, మాన్‌లు కూడా అందుకు ఒప్పుకోలేదు. తిరిగి కారు దగ్గరకొచ్చారు. వేరేచోటికి వెళ్లి తెల్లవారేవరకు వేటాడి ఓ కుందేలు, ఓ అడవిపందిని పట్టుకొని గెస్టుహౌసుకి చేరారు.

కోవూర్‌కి మాత్రం మనసంతా ఆ 'దెయ్యాల' మీదే వుంది.

తెల్లవారింది. ఫలహారం ముగిసాక కోవూర్ ఒత్తిడి మీద చిన్నయ్య పగలు ఆ దయ్యపు చెట్లని చూపటానికి బయల్దేరాడు. జాకబ్ మాత్రం రానని కచ్చితంగా చెప్పాడు. మాన్‌కి భయంగా వున్నా పగలు వాటిని చూడాలనిపించింది. వాళ్లతో తనూ బయలుదేరాడు.

ముగ్గురూ ఆ చెట్లదగ్గరకు చేరుకున్నారు. రాత్రి చూసిన చెట్లను కోవూర్, మాన్‌లు గుర్తుపట్టలేక పోయారు. చిన్నయ్య చూపించినా వారికి నమ్మకం కల్గలేదు. వాటికిప్పుడు ఏ వెలుగూ లేదు.

కోవూరు వాటి దగ్గరకు నడవసాగాడు. చిన్నయ్య వారించాడు. వినలేదు. మాన్‌కూడా కొంత ధైర్యం చేసి కోవూర్‌ని అనుసరించాడు. ఇద్దరూ ఆ 'పాల్' చెట్ల దగ్గర కెళ్లి పరిశీలించసాగారు.

అక్కడున్న రెండు పెద్దచెట్లకూ చాలా



వయసుంటుంది. వాటిలో ఒకటి ఎండిపోయింది పూర్తిగా. రెండోది కొంత భాగం ఎండింది. అక్కడున్న చాలా చెట్లకి కుడివైపున లేత పసుపు రంగులో వున్న దట్టమైన చిక్కని బూజు వంటిది పట్టింది.

కోవూర్ జాగ్రత్తగా అంతా గమనించాడు. సంచిలోంచి కత్తిని తీసాడు. ఆ చెట్టు బెరడుని చెక్కి తన సంచిలో వేసుకున్నాడు.

కొంత సేపు అక్కడ అన్నిటినీ పరిశీలించి తిరిగి గెస్ట్‌హౌస్‌కి చేరారు. జాకబ్ అప్పటికే సామాన్లన్నీ సర్ది రెడీగా వుంచాడు.

చిన్నయ్యకు ఇవ్వాల్సింది ఇచ్చేసి ముగ్గురూ కార్లో జాఫ్నా చేరుకున్నారు.

'దయ్యాల' చెట్టు బెరడుతో సాయంకాలం వరకూ పరిశోధన చేస్తూనే ఉన్నాడు కోవూర్. చీకటి పడింది.

భార్య శ్రీమతి అక్కా కోవూర్ని, మూడేళ్ల కొడుకును పిల్చి తన టేబిల్‌కి ఎదురుగా కూర్చోబెట్టారు. గదిలో లైట్లన్నీ తీసేసాడు.

అంతే. కుర్చీలో కూర్చున్న వారిద్దరూ ఆశ్చర్యంతో ఎగిరి గంతేశారు. వాళ్ల సంతోషానికి అవధుల్లేవు. ఎంత అద్భుతకాంతి!

"ఓరే బుజ్జీ! అవేంటనుకున్నావురా! కాదేరి దయ్యాల మునిమనుమళ్లురా" అంటూ కొడుకుకు వివరించింది అక్కా.

ఆ చెట్ల బెరళ్లు అలా పసుపు రంగులో వుండటానికి కారణం మెరిసే సూక్ష్మజీవులతో ఏర్పడ్డ ఫంగస్ (నాచు). ఇలా చెట్లమీద భాస్వరగుణం గల ఫంగస్ ఏర్పడటం, అది రాత్రివేళ ప్రకాశించడం అడవుల్లో వింతేమీ కాదు. నిర్జీవమైన చెట్లమీద ఈ ఫంగస్ ఎక్కువగా ఏర్పడుతుంది. వాటి బెరళ్లని, ఫంగస్‌ని పరీక్షిస్తే నిజం బయటపడుతుంది.

అయితే అన్ని రకాల ఫంగస్‌కి మెరిసే గుణం ఉండదు. కాంతిదాయక సూక్ష్మజీవుల **(Bioluminous organisms)** తో ఏర్పడ్డ ఫంగస్ గల చెట్ల బెరళ్లకే అలాంటి అద్భుత కాంతి వస్తుంది. ఈ సంగతి తెలియనివారంతా ఆ చెట్లని దయ్యపు చెట్లని అమాయకంగా నమ్ముతుంటారు.

భాస్వరగుణం (ఫ్రష్ఠశింజూప్త్రశీవంఎవఎవ) గల ఫంగసే కాకుండా కొన్ని మొక్కలు, జంతువులు కూడా స్వయంగా ప్రకాశిస్తూ ఉంటాయి. వాటిని స్వయం ప్రకాశక జీవులు లేదా కాంతిదాయక జీవులు అనవచ్చు. ఇలాంటివి సముద్రాల్లో ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువమందికి వీటి గుర్చి తెలియదు.

'మిణుగురు పురుగులు' గుర్చి మనందరికీ తెలుసు. ఇలాంటివే చీకటి గుహల్లో, అడవుల్లో మరికొన్ని కనిపిస్తాయి. ఈ మిణుగురు పురుగు కూడా నిజానికి పేడ పురుగులాంటిదే. మగ మిణుగురులకే ప్రకాశించే గుణం, ఎగిరే శక్తి వున్నాయి. ఆడ మిణుగురులు కొన్ని మొక్కలను అంటిపెట్టుకొని వుంటాయి. మన మిణుగురులు మెరుపుల వల్లనే ఆడ, మగ పరస్పరం తెలుసుకుని కలుసుకుంటాయి.

కొన్ని రకాల బ్యాక్టీరియాలో కూడా ఈ మెరిసే గుణం వుంది. జంతు కళేబరాలు, చేపలు, మొదలైనవి కుళ్లి పోయినప్పుడు అవి ఒక్కోసారి చీకట్లో మెరుస్తుంటాయి. అందుక్కారణం బాక్టీరియానే.

న్యూజిలాండ్‌లో అక్కడక్కడ కొన్ని గుహల గోడలు ఇలాంటి స్వయంప్రకాశ జీవులవల్లనే మెరుస్తుంటాయి. ఈ జీవులకు తలమీద కాంతినిచ్చే కణాలు వుంటాయి. రాత్రివేళ అవి పోతూవుంటే హెడ్‌లైట్స్ గల కార్లు పరుగెత్తుతున్నట్లు ఉంటుంది.

సముద్రంలో నాక్టిలుకా **(Noctiluca)** అనే అతి సూక్ష్మ జీవులుంటాయి. సముద్రం కల్లోలితమైనప్పుడు అవి పైకి వచ్చి మెరుస్తుంటాయి. కోట్లాదిగా వచ్చి ఇవి నీటిపై మెరుస్తుంటే మంట వస్తున్నట్లు అన్పిస్తుంది కూడా.

అడవిలో మెరిసే చెట్లని చూసి చిన్నయ్యలాంటివారు ఎలా భయపడతారో, సముద్రాల్లో తిరిగేవారు కూడా ఇలాంటి కాంతిపుంజాల్ని చూసి నీటిదయ్యాలుగా భావించి భయపడతారు.

స్వయంప్రకాశ జీవులమాదిరే కొన్ని రకాల ముత్యాలు, ఆలు చిప్పలు , చేపలు, నత్తలు , కాళ్లజెర్రులు, రోకటిబండ పురుగులు మొదలయినవి సముద్రాల్లో మెరుస్తుంటాయి. 1887లో రాఫేల్ దుబోయ్ (Raphaol Duboi) అనే శాస్త్రవేత్త ఇలా మెరిసే కాంతి కణాలు (Pholas Shells) మెరవటానికి కారణాలను గుర్చి పరిశోధించాడు. వాటిల్లో మెరుపు రావటానికి వాటిల్లో లుసిఫెరిన్ (Luciferin) అనే పదార్థముండటమే కారణమన్నాడు.

స్వయంప్రకాశ శక్తిగల బ్యాక్టీరియా, ఫంగస్, మిణుగురులు, సముద్రాలలోని కొన్ని జీవులలో మెరిసే గుణం నిరంతరం వుంటుంది. వాటి నరాల వ్యవస్థ మెరుపును కంట్రోలు చేస్తుంటుంది. అందుకే ఒక్కోసారి వెలుగు ఆగిపోవటం కూడా ఉంటుంది. అలాగే వాటి నుంచి వచ్చే కాంతిలో కూడా వేడి వుంటుంది. సాధారణంగా నీలం, పసుపు, ఎరుపు, ఆకుపచ్చ రంగు ప్రాంతాలలో కాంతి ఎక్కువగా ఉంటుంది.

మన కథలో 'కాదేరి దయ్యపు' చెట్లు (పాల్ చెట్టు – Mimusopes Hexandra) ఫంగస్ వల్లే మెరుస్తున్నాయని మనం గ్రహించవచ్చు. ఎండిన చెట్టు మీద మొదటగా ఆ ఫంగస్ ఏర్పడింది. ఫంగస్‌లో వుండే 'స్పోరు'ల వక్క చెట్లక్కూడా వ్యాపించింది.

ఇదంతా తెలియకనే ఆ చెట్లని 'దయ్యాల కుటుంబం'గా ఆ అడవిలో అందరూ భావించి భయపడుతున్నారు.

దయ్యాలున్నాయనీ, దేవుడున్నాడని నమ్మటం వల్ల తనకు తెలియనివన్నీ వాటి ప్రభావం వల్లే జరుగుతున్నాయని చాలా మంది విశ్వసిస్తారు. ఈ విశ్వాసాలే వారిని మానసికంగా బలహీనపరిచి ఒక్కోసారి ప్రాణాపాయాన్ని కూడా కల్గిస్తాయి. ఈ చెట్లని రాత్రివేళ చూసి విపరీత భయానికి గురైనవారే అక్కడిక్కడ చనిపోయారు. ✦

నవ్వుల్ పువ్వుల్

జ్యోతిషం

'నాకు ఉద్యోగం ఎప్పుడొస్తుందో చెప్పండి' జ్యోతిషుడిని అడిగాడు రాజు.

'అది తెలిస్తే నేనిలా అందరికి జాతకాలు చెబుతున్నాను..' అన్నాడు జ్యోతిషుడు.

చిన్నపని

సలీం: అరే జంబులింగం భాయ్ ఎలా ఉన్నావ్?

జంబులింగం: నేను మస్తుగున్నా, నువ్వెలా ఉన్నావ్?

సలీం: నేను సూపరు. అన్నట్టు ఒక చిన్న పనుంది...

జంబులింగం: సర్లే! ఆ పనేదో చూసుకో! అదయ్యాకే మాట్లాడదాం.

సలీం: ఆ...

తాజ్ మహల్

షాజహాన్ ముంతాజ్ కోసం తాజ్ మహల్ కట్టాడు.

మరి నా కోసం మీరేం కడతారండి..? అడిగింది రోజా.

"కడుతూనే ఉన్నానుగా... నెల నెల పాత్రల చీటి, చీరల చీటి, నగల చీటి...? చెప్పాడు రాజు.



కావాల్సిన పదార్థాలు

మీల్ మేకర్ ఖీమా–1/2 కిలో

చక్కెర – ఒక కప్పు

క్యారెట్ లేదా బీట్ రూట్ తురుము– ఒక కప్పు

నెయ్యి–100 గ్రాములు

యాలకుల పొడి– చిటికెడు

జీడిపప్పు, ఎండు ద్రాక్ష– 25 గ్రాములు

పాలు–రెండు కప్పులు

తయారీ

ముందుగా మీల్ మేకర్‌లో కొద్దిగా ఉప్పు వేసి ఐదు విజిల్స్ వచ్చే దాకా ఉడికించి జార్‌లో ఖీమా బ్లేడ్ పెట్టి ఖీమాలాగా చేసి పెట్టుకోవాలి. స్టవ్ మీద బాణలి పెట్టి నెయ్యి వేసి డ్రైఫ్రూట్స్ వేయించి పక్కన బెట్టుకోవాలి. క్యారెట్ తురుము వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే బాణలిలో పాలు పోసి బాగా వేడి చేసి అందులో వేయించిన క్యారెట్, ఉడికించిన సోయా ఖీమా వేసి తిప్పుతూ బాగా మెత్తగా ఉడకనిచ్చి యాలకుల పొడివేసి నెయ్యి తేలేలాగా దగ్గర కానివ్వాలి. దించేముందు వేయించిన డ్రై ఫ్రూట్స్ వేసి దించాలి. ఇది కొద్దిగా చల్లారాక సర్వ్ చేసుకోవాలి. వెరైటీగా రుచిగా ఉంటుంది.

పులావ్



కావాల్సిన పదార్థాలు

మీల్ మేకర్–250 గ్రాములు

బాస్మతి బియ్యం–250 గ్రాములు

నెయ్యి, నూనె– 100 గ్రాములు

ఉప్పు–ఒక టేబుల్ స్పూను

దాల్చిన చెక్క– ఒక ముక్క

అల్లం– 25 గ్రాములు

వెల్లుల్లి రెబ్బలు– ఒక గుప్పెడు

యాలకులు–మూడు

లవంగాలు–15

బిర్యాని ఆకులు–రెండు

పుదీనా–నాలుగు రెబ్బలు

కొత్తిమీర–నాలుగు రెబ్బలు

పచ్చిమిర్చి–నాలుగు

ఉడికించిన గ్రీన్‌పీస్–50 గ్రాములు

ఆలుముక్కలు–ఒక చిన్న కప్పు

ఉల్లి తరుగు–ఒక చిన్న కప్పు

తయారీ

ముందుగా ఆలు ముక్కలు, గ్రీన్ పీస్, సోయా (మీల్ మేకర్) విడివిడిగా ఉడికించుకోవాలి. స్టవ్ మీద చిన్న కుక్కర్ పెట్టి నెయ్యి, నూనె వేసి కొద్దిగా వేడి చేయాలి. యాలకులు, దాల్చిన చెక్క, సగం అల్లం, సగం వెల్లుల్లి పేస్ట్ వేసి వేయించాలి. అందులోనే బిర్యానీ ఆకులు, కొత్తిమీర, పుదీనా ఉల్లి తరుగు వేసి వేయించాలి. ఆ తర్వాత మిగతా అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి మంచి వాసన, రంగు రుచి వచ్చేదాకా వేయించి గ్రీన్‌పీస్, ఆలు ముక్కలు, సోయా ముక్కలు ఉడికించినవి వేసి తగినంత నీరు, ఉప్పు వేసి కడిగిన బియ్యం వేసి నాలుగు విజిల్స్ వచ్చే వరకు ఉంచాలి. మంచి సోయా పులావ్ రెడీ, దీన్ని సోయా ఖుర్మా లేదా బఠానీ ఖుర్మా లేదా పుదీనా చట్నీతో తినవచ్చు. చాలా రుచిగా ఉంటుంది.

దాల్చా

కావాల్సిన పదార్థాలు

మీల్ మేకర్ –వంద గ్రాములు

కందిపప్పు–50 గ్రాములు

కొబ్బరి–చిన్న ముక్క

కొత్తిమీర – నాలుగు రెమ్మలు

టమాటాలు– నాలుగు

చింతపండు రసం– ఒక కప్పు

ఉల్లి తరుగు–1/2 ఉల్లిపాయ

ఉప్పు–అర టీ స్పూన్

కారం– ఒక టీ స్పూను

ధనియాల పొడి–మూడు టీ స్పూన్లు

పసుపు–చిటికెడు

తయారీ

ముందుగా సోయా ఉడికించి పెట్టుకోవాలి. స్టవ్ మీద ఉడికించిన సోయా, ఉప్పు, పసుపు, రెండు రెమ్మల కొత్తిమీర తరుగు వేసి ఒక నిమిషం సన్నని సెగ మీద తిప్పాలి. ఆ తరువాత టమాట ముక్కలు వేసి మెత్తగా ఉడకనివ్వాలి. కొబ్బరి మిశ్రమం, కందిబేడల మిశ్రమం, చింతపండు రసం వేసి పది నిమిషాల పాటు ఉడకనివ్వాలి. కమ్మని సోయా మీల్ మేకర్ రెడీ.



కత్తిరించి అతికించండి

ఈ చిత్రంలోని జంతువులు ఏఏ ప్రదేశంలో నివసిస్తాయో వాటిని దిగువభాగాన్ని ఇవ్వడం జరిగింది. వాటిని కత్తిరించి ఆ జంతువులకు ఎదురుగా అతికించండి.



రంగులేద్దామా



బొమ్మ గీద్దాం

ఆర్టిస్టు అంకుల్ ఈ రోజు మీకొక చిన్న పరీక్ష పెట్టదలచాడు. ఈ చిత్రాల ఆధారంగా ఒక అందమైన అమ్మాయిని గీయండి.



ఏమేం వున్నాయి?

చూడ్డానికి వింత జీవిలా వుంది కదూ. అయితే ఈ చిత్రంలో రెండు జీవుల శరీర భాగాలున్నాయి. వాటిని గుర్తించి పేర్లు చెప్పండి.

పదాలు పట్టుకోవాలి

ఈ అక్షర సమూహంలో 16 పదాలు దాగున్నాయి. అడ్డంగా, నిలువుగా, వంకరగా ఎలాగైనా ఉండొచ్చు. వాటిని గుర్తించి సున్నా చుట్టండి.

Halloween words and circle them!

BAT BOO CANDY GHOST GHOUL MASK MONSTER ZOMBIE

G Z D A N I E L
H O Y T Y V M U
O M A C I B O O
S B Y V C P Z H
T I P I A C V G
R E T S N O M A
M A S K D W S I
O D C P Y D W S

ఎక్కడు దాక్కున్నాయో

ఈ బొమ్మలో 17 వస్తువులు దాగి ఉన్నాయి. ఏవంటే...అదిగో కింద ఇచ్చాం కదా. వాటిని గుర్తించి సున్నా చుట్టండి.



గొడుగు పక్షులు

తలకు గొడుగులాంటి ఈకలతో ఉండే ఈ గొడుగు పక్షులు మధ్య దక్షిణ అమెరికాల్లో కనిపిస్తాయి. మూడు వర్గాలుగా ఉన్న వీటిలో ఒక రకానికి పొడవాటి గొంతు సంచి ఉంటుంది. అమేజాన్ అడవుల్లో ఎక్కువగా కనిపించే మరో రకానికి కాస్త చిన్నపాటి సంచి ఉంటుంది. గొంతుకకు సంచి లేకుండా ఎర్రటి మచ్చ ఉన్న రకం మరోటి. ఇవి పూర్తిగా నల్లగా ఉంటాయి. ఎత్తైన చెట్ల మీద ఉండటం వల్ల ఇవి కంటపడటం చాలా అరుదు.

- 35 నుంచి 50 సెం.మీ. వరకు ఇవి పెరుగుతాయి.
- వీటి గొంతు సంచి 35 సెం.మీ. వరకు ఉంటుంది.
- ఈ సంచి ప్రత్యేకత ఏమిటంటే పక్షులు అరిచినప్పుడు వాటి శబ్దాన్ని మరింత పెద్దగా వినిపించేలా చేస్తాయి.
- చెట్ల మీద పళ్లను తినే ఇవి పెద్ద కీటకాలు, చిన్న సరీసృపాల్ని లాగించేస్తాయి.
- పర్వత ప్రాంతాల్లో ఎక్కువగా తిరిగే ఇవి వాటి ఆకారం కారణంగా ఎక్కువ దూరాలు ప్రయాణించలేవు.
- ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్లడానికి భిన్నంగా పర్వతాలపైకి తరలిపోతాయి.
- లెక్స్ అనే గుంపులుగా పోగై భాగస్వామి కోసం విన్యాసాలు చేస్తూ పోటీ పడతాయి.
- ఆడ పక్షులే పిల్లల విషయంలో ఎక్కువ బాధ్యతగా ఉంటాయి.
- గూడు కట్టిన దగ్గర నుంచి గుడ్డు పొదగడం, పిల్లలకు ఆహారం తేవడం, వాటిని పెద్దవి చేయడం వరకు మొత్తం ఆడవే చూసుకుంటాయి.
- ఏడాదికి ఒక గుడ్డు చొప్పున పెట్టే ఇవి ఒకే చెట్టు మీద మళ్లీ మళ్లీ గూళ్లను కట్టి పిల్లల్ని పెద్దవి చేస్తాయి.
- చాలా ఎత్తుగా, గుబురు అడవికి దూరంగా ఉండే చెట్లనే గూళ్లకు ఎంచుకుంటాయి.
- 16 ఏళ్లపాటు బతికే ఇవి అడవుల నరికివేత వల్ల అంతరించి పోతున్నాయి.
- ముఖ్యంగా బారు సంచి ఉన్న గొడుగు పక్షులు.
- ఇవి కేవలం కొన్ని దట్టమైన అటవీ ప్రాంతాల్లో మాత్రమే మనగలవు.

జాషువా కవిత్వం నిత్య స్ఫూర్తిదాయకం

"అనుభూ త్యావేశంబుల/ జనితములగు లలితకళలు సాధ్యములగునే / కనకపు బోటీలకు ని / మ్మను జేశుల మెచ్చుకోలు మర్యాదలకున్" అన్నాడు మహాకవి జాషువా 'ముంటాజమహలు' కావ్యంలో. తాను రాసిన ఏ రచనలోనైనా పీడితుల కోసం ఏకీభావన చెందుతాడు. వారి ద్వారానే తన కవితాభిప్రాయాలు వెలువరిస్తాడు. అంటే తన కవిత్వానికి సంబంధించిన ప్రేరణల్ని కూడా ఆ మాటలతో గ్రహించవచ్చునని ధ్వనింపజేస్తాడు. పై పద్యంలో 'అనుభూతి', 'ఆవేశం' అనే రెండు మాటల్ని అవగాహన చేసుకొంటే, జాషువా అభిప్రాయం అర్థమవుతుంది. 'అనుభూతి' వైయక్తికం. 'ఆవేశం' సామాజికం. ఒక సన్నివేశాన్ని చూసినప్పుడు, భావించినప్పుడు అది అనుభూతి స్థాయికి వెళ్ళాలంటే, చెప్పే విధానంలో కొత్తదనం ఉండాలి. దాన్నే శిల్పమనీ, అభివ్యక్తి అనీ విశ్లేషిస్తాం. ఆ శిల్ప విశేషం నుండే తన రచనని గొప్ప అనుభూతి స్థాయికి తీసుకువెళ్లగలడు కవి. కవిలో అనుభూతి స్థాయి ఉండాలి. అది పాఠకునిలో రగిలించగలగాలి. రెండోది 'ఆవేశం'. సమాజంలోని అన్యాయాల్ని చూసినపుడు కవి మనస్సు ఆవేదన

మహాకవి జాషువా ప్రగతిశీలత, కళాత్మకత, డా॥ అద్దేపల్లి రామమోహనరావు, వెల: రు.40/-, పేజీలు: 70, ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్, 27-1-64, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ-2, ఫోన్: 0866 2577533.

నుండి ఆవేశ దశకి వెళ్ళాలి. అప్పుడే కవిత్వంలో, పాఠకుని మనస్సును తాను ఖండింప దలచిన అన్యాయాలకి విముఖం చేయగలడు.

జాషువా మొత్తం కవిత్వాన్ని చదివితే ఆయన వస్తువిస్తృతిని గమనించవచ్చు. ఆయన ప్రాచీన సాహిత్య అధ్యయనం చేసిన గొప్ప పండితుడు; తన కాలంలోని అన్ని భావప్రవంతులు ఆయనని ప్రభావితం చేసినవే. భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, దేశభక్తి కవిత్వం మొదలైన అన్నింటి ప్రభావం ఉంది. ఈ అన్నింటినీ యథాతథంగా స్వీకరించకుండా, తనదైన శైలిని నిర్మించుకోవడంలో జాషువా ప్రత్యేకత కనిపిస్తుంది. అదీగాక, ఇంగ్లీషు కవిత్వం జోలికి వెళ్లలేదు కాబట్టి అచ్చమైన దేశీయత, స్పష్టమైన భాష, ప్రజల్ని కదిలించే అభివ్యక్తి సాధింపగలిగాడు.

మహాకవి జాషువాను పరిమిత పరిధిలోనే చూస్తే పూర్తి అవగాహన రాదు. ఆ మాట ఆయనే 'విశ్వనరుడ నేను' అనే మాటలో తెలియజేశాడు. అందుకే కాలనేపథ్యాన్ని, ఉద్యమ ప్రభావాన్నీ, శిల్ప మార్మికతనీ వివరించకుండా జాషువాని పూర్తిగా విశ్లేషించలేము. అన్ని విశ్లేషణలూ అవసరమే, కాని విస్తృతిగల మహాకవి కాబట్టి విస్తృత అవగాహన మాత్రమే సమగ్రతను సమకూర్చగలదు. అందుకోసం డా॥ అద్దేపల్లి రామమోహనరావు 'జాషువా కవితా సమీక్ష' అనే పుస్తకం ప్రచురించారు.

కాలంలో సామాజికంగా అన్ని రకాల న్యాయాలకోసం, దేశ అస్తిత్వం కోసం ఎక్కడకక్కడ పోరాటాలు జరుగుతున్నై. ఆ స్పృహ కలిగించే సాహిత్యం చాలా విస్తృతంగా వస్తుంది. ఇది ఈనాడు ఆవశ్యకమైన విషయం. ఆ చైతన్యం ప్రజలందరికీ అందించడానికి ప్రజాశక్తి వారు చేస్తున్న నిరంతర కృషి ప్రశంసనీయం. ఆ క్రమంలోనే జాషువాపై, ఇంతకు ముందే ప్రచురించిన కొందరి గ్రంథాల్ని పునర్ముద్ర చేయడం ఒక సామాజిక అవసరం. ఆ దృక్పథంతోనే అద్దేపల్లి వారి పుస్తకాన్ని కూడా మరొక వ్యాసాన్ని రాయించి మరీ 'మహాకవి జాషువా ప్రగతిశీలత, కళాత్మకత'గా ముద్రించి అందిస్తున్నారు ప్రజాశక్తి బుక్‌హౌస్ వారు.

- స్నేహ

విస్మృత జీవితానుభవాల 'ఇల్లూ వాకిలి'

ఇవి తెలంగాణ సామాజిక చరిత్రను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే కథలు. 1970 నుంచి 2015 దాకా సాగిన తెలంగాణ సామాజిక పరిణామాలను ఆయా సామాజిక వర్గాల ఉత్థానపతనాలను, ఉద్యమ తీరు తెన్నులను ఒక ప్రత్యేక ప్రాపంచిక దృక్పథంతో చిత్రించారు. డా॥ఎస్వీ. సత్యనారాయణ "విస్తృత జీవితానుభవ నిక్షేపాలు" అంటూ విలువైన మాట రాశారు. కాలేజి విద్యార్థుల మానసిక సంఘర్షణల భావధార, టీనేజ్ లవ్ ప్రభావాలపై చర్చలా 'మాయ- ప్రేమ' (పేజీ 174) కథ సాగింది. జర్నలిస్ట్ ప్రేమ కథ. మరదలి పెళ్ళికి వెళు తుండటం... దారిలో నక్సల్స్ బస్సును ఆపి కాల్చబోవడం, స్త్రీలు అడ్డు పడటం, మళ్ళీ బస్సు కదలడం (నక్సల్స్ దళం ప్రజాకోరిక మన్నించి

ఇల్లూ వాకిలి, రచన: బి.ఎస్. రాములు, పేజీలు: 184/-, వెల: 125/-, ప్రతులకు: నవ చేతన పబ్లిషింగ్ హౌస్, గిరి ప్రసాద్ భవన్, హైదరాబాద్.

బస్సును కాల్చకుండా వదలడం వల్ల) మరదలి పెళ్ళికి వెళ్ళడం... కథాంశంలో ... సంభాషణల్లో స్త్రీ వాదం చొప్పించడం- అరుణ ప్రేమ, భార్య విమల తీరు ... తన జర్నలిస్ట్ ఉద్యోగం అంశాలు పాఠకుల్ని ఆలోచింపజేస్తాయి. ఈ సంపుటిలో దాదాపు 15 కథలున్నాయి. జైలు పరిస్థితుల్ని చెప్పే "జైలు జీవితం" (పేజీ 161) కథ ఈ వ్యవస్థకు అద్దం పడుతుంది. 'దక్షయజ్ఞం' కథ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. కొంచెం పెద్ద కథే. ఫాసిస్ట్ కోర్టులో డిమిట్రోవ్ సింహగర్జన చదివిన పాఠకులకు ఈ 'దక్ష యజ్ఞం' కథ ఆసక్తి కల్గిస్తుంది. పెంటయ్య అలియాస్ ప్రవీణ్ కోర్టు హాలులో చేసిన ప్రసంగం ఉద్యమకారుల జీవితానికి సంబంధించినది. దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమె నాగిరెడ్డి లాంటి వారు కోర్టులో తాము చెప్పదలచుకొన్న అంశాలు చెప్పి లిఖిత పూర్వకంగా ఇచ్చిన తీరు గుర్తుకొస్తుంది. 'ఇల్లూ-వాకిలి, అమ్మ, చరిత్రహీనులు, మెరుగు ఎనుకట ఏముండె' కథలు వాస్తవ జీవిత దర్పణాలే. ఇవేవి కల్పిత కథలు కావు. వాస్తవ జీవితాలకు కథా రూపం ఇచ్చిన సామాజిక చరిత్ర కథలు. కాల పరిణామాలను నిక్షిప్తం చేయడానికి రచనలు చేసే రాములు కలం నుంచి సామాజిక చైతన్యాన్ని తెచ్చే కథలు మరిన్ని రావాలి.

- తంగిరాల చక్రవర్తి



అందాల అరటి నార చీరలు

పురాణాల్లో చదువుకున్నాం. ముని స్త్రీలు నార చీరలు కట్టుకునేవారని. అలాంటి చీరలు ఇప్పుడు మన కళ్ల ముందర ప్రత్యక్షమైతే ... ఎలా వుంటుంది?! ఆశ్చర్యానందాలతో ఉబ్బితబ్బిబ్బైపోమూ! అపురూపమైన అరటి నార చీరలకు కాంచీపురం జిల్లాలోని అనకాపుతూర్ వేదికైంది. స్వాతంత్ర్యానికి పూర్వం ఈ చిన్ని గ్రామం 'చెన్నై కర్చీఫ్'లకు పేర్గాంచినది. బ్రిటీష్‌వాళ్లు వాటిని నిషేధించడంతో చేనేతపనివారు చీరలను నేసే పనికి మళ్లారు. ఇప్పడక్కడ 300 మగ్గాలు, యాభై మంది నేత పని వారు వున్నారు. నిజానికి అరటి మొక్కనుంచి చీరలు తయారు చేయాలన్న ఆలోచన శేఖర్‌ది. ఇతను ఓసారి స్థానికంగా ఓ పెళ్లికి వెళ్లాడు. పెళ్లి ఇంట్లో అలంకరించిన అరటి బోదెలపై చెయ్యి పడి ... గోళ్లు గుచ్చుకొని పీచు కనిపించింది. అతను అరటి పీచును చూడడం అదే మొదటిసారి. అయితే దాన్ని బైటకు తీయడం ఎలాగో అతనికి తెలీలేదు. ఆ తర్వాత ఎన్నో ప్రయోగాల అనంతరం సఫలీకృతుడయ్యాడు. మన దేశంలో ఏడాదికి మూడుమార్లు అరటి తోట వేస్తుండడంతో కాపు అయ్యాక చెట్లను నరికేస్తుంటారు. చీరలు నేయడానికి అదే ప్రధాన ముడి సరకు కావడంతో కొరత లేకుండా పోయింది. పైగా చీరలకు వాడే రంగులు కూడా సహజసిద్ధమైనవి కావడంతో మన్నిక, నాణ్యత విషయంలో ఎలాంటి అనుమానం అవసరం లేదు. చీర నేయడానికి 5 నుంచి 10 రోజుల సమయం పడుతుంది. ముడిసరకును బట్టి చీర ధర 2,500 రూపాయల నుంచి ఆ పైన పలుకుతుంది. ◆

చెమెరా

ఎండు కొమ్మలపై పరిచిన ప్రకృతి

అన్నీ ఎండి రాలిన కొమ్మలే. అలా వదిలేస్తే వానకు తడిచి ఎండకు ఎండి కొంత కాలానికి మట్టిలో కలిసిపోతాయి. వాటినే సేకరించి ... బొమ్మలు వేసి... రంగులు అద్దితే ... చూపు తిప్పకోనివ్వని ఆకృతులు రూపుదిద్దుకుంటాయి. ఈ ఆలోచన వెస్ట్ చెస్టర్‌కు చెందిన చెమెరా అనే కళాకారిణిది. ఈమె ఐదారు మాసాల కిందటి వరకు స్థానికంగా ఓ కంపెనీలో పనిచేసేది. పచ్చటి ప్రకృతి మధ్య పుట్టి పెరిగిన ఆమెకు అధిక సమయం కంప్యూటర్ ముందు పనిచేయాల్సి రావడం చాలా కష్టంగా తయారైంది. బోర్ కొట్టించే ఉద్యోగం విడిచిపెట్టి... తన మనసుకు నచ్చిన, మెచ్చిన పని చేయాలనుకుంది. మనసుంటే మార్గాలకేం కొదవ! పెరట్లో వున్న చెట్ల ఎండుకొమ్మలను సేకరిస్తుంది. వాటిని జాగ్రత్తగా కత్తిరించాక... శాండ్ పేపర్‌కు పని పెడుతుంది. ఆనక చిన్నతనం నుంచి తను చూసిన నిశీధి రాత్రులు, జంతుజాలానికి పెద్ద పీట. చిన్ని చెక్క ముక్క మీద వెలసిన ప్రకృతి దృశ్యం ఎవరికి మాత్రం నచ్చదు. ఫ్రిజ్జులు, బీరువాల మీదే కాదు. గోడల మీద నచ్చిన చోట వేళ్లాడదీయొచ్చు వీటిని. ప్రస్తుతానికి చెమెరా ఈ పనిలోనే మునిగి తేలుతోంది. అందమైన ఆలోచన కదా! ◆